# ప్రజా తపన

prajathapana.com

News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 66 ఆదివారం 23 ఏప్రిల్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




# అట్టహాసంగా గంగా పుష్కరాలు ప్రారంభం

**ప్రజా తపన ,లక్నో :**

పవిత్ర గంగా పుష్కరాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం నుంచి మే 3వ తేదీ వరకు 12 రోజులపాటు గంగా పుష్కరాలు జరగనున్నాయి. గంగానది ప్రవహించే ప్రతిచోటా కన్నుల పండుగగా ఉత్సవాలు సాగనున్నాయి. అయితే, గంగా పుష్కరాలు అంటే అందరికీ గుర్తొచ్చేది కాశీనే. భక్తులంతా కాశీ వెళ్లడానికే మొగ్గుచూపుతారు. ఇక్కడే త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు నివసిస్తారని భక్తుల నమ్మకం. అంతేకాదు.. గంగానదిని అత్యంత పవిత్రంగా భావిస్తారు భారతీయులు.గతించిన ఆత్మీయులకు గంగా జలాల్లో పిండప్రదానం చేస్తే ముక్తి లభిస్తుందని నమ్ముతారు. అందుకే.. గంగా పుష్కరాలు భారతీయులకు ఎంతో ప్రత్యేకం అని చెప్పొచ్చు. గంగా పుష్కరాల కోసం తెలుగు ప్రజలు కూడా వారణాసి, ప్రయాగ్ రాజ్, హరిద్వార్ వంటి పుణ్యక్షేత్రాలకు పెద్ద ఎత్తున తరలి వెళ్తుంటారు. అందుకే.. తెలుగు ప్రజల కోసం కాశీలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాట్లు చేశారు. ఈ నెల 29న వారణాసిలోని గంగా ఘాట్ దగ్గర జరిగే తెలుగు సంగమంలో ప్రధాని మోదీ పాల్గొనున్నారు.ఇక.. ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో గంగా నది ప్రవహిస్తుండంతో ఆయా ప్రాంతాల్లో గంగా పుష్కరాలను వైభవంగా జరుపుకుంటారు. ఇప్పటికే.. గంగోత్రి, గంగాసాగర్, హరిద్వార్, బదిరీనాథ్, కేదారనాథ్, వారణాసి, అలహాబాద్ క్షేత్రాల్లో ఘాట్లు సిద్ధమయ్యాయి. సాధారణంగా కాశీలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం గంగా పుష్కరాలు కావడంతో మరింత మంది వచ్చే అవకాశం ఉంటుంది. గంగానది తీర ప్రాంతాలు.. పుణ్యస్నానాలు చేసే భక్తులతో నిండిపోనున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలుగకుండా యోగి ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఎండాకాలం నేపథ్యంలో భక్తులు ఇబ్బంది పడకుండా దానికి తగ్గట్లుగా జాగ్రత్తలు

02

# మళ్లీ మోడీనే

## తేల్చిచెప్పిన ఎగ్జిట్ పోల్స్

**ప్రజా తపన ,న్యూఢిల్లీ :**



లోక్‌సభకు ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే గెలిచేది ఎవరో టైమ్స్ నౌ నవభారత్ సర్వే తేల్చేసింది. 292 నుంచి 338 సీట్లతో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరిస్తుందని తెలిపింది. కాంగ్రెస్ పార్టీకి 106 నుంచి 144 వరకూ వస్తాయని వెల్లడించింది. పశ్చిమబెంగాల్‌లో టీఎంసీకి 20 నుంచి 22, ఒడిశాలో బీజేడీకి 11 నుంచి 13 స్థానాలు దక్కుతాయని అంచనావేసింది. ఇతరులు 50 నుంచి 80 స్థానాల్లో గెలుస్తారని తెలిపింది.అసలు 2024 వరకూ ఎందుకు ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెట్టినా బీజేపీదే అధికారం అంటోంది టైమ్స్‌నౌ-నవభారత్ సర్వే. దేశవ్యాప్తంగా ప్రజల మూడ్‌పై టైమ్స్‌నౌ-నవభారత్ సర్వే చేపట్టింది. ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరిస్తుందని జోస్యం చెప్పింది.బీజేపీకి 292 నుంచి 338 సీట్లు వస్తాయంది సర్వే. కాంగ్రెస్ కూటమికి 106నుంచి144 సీట్లు రావొచ్చని అంచనా వేసింది. అయితే, మొత్తంగా మరోసారి ప్రజల మద్దతు బీజేపీకే ఉందంటోంది సర్వే. బ్రాండ్ మోదీకి జనంలో తిరుగులేని మద్దతు ఉందనే విషయం స్పష్టమైందంటోంది.నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు బీజేపీకి 282 స్థానాలు దక్కాయి. 2019లో 303 సీట్లలో కమలనాథులు గెలిచారు. 2024 లోక్‌సభలో

02



# మోడీకి బెదిరింపు

## అలెర్ట్ అయిన కేరళ పోలీసులు

**ప్రజా తపన ,తిరువనంతపురం:**

ప్రధాని నరేంద్ర మోదీ త్వరలోనే కేరళలో పర్యటించనున్నారు. తిరువనంతపురంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి గుజరాత్‌కు వెళ్లనున్నారు. అయితే కేరళ పర్యటనకు ముందు బీజేపీ ఏర్పాట్లు చేస్తుండగా ఓ షాకింగ్ అనుభవం ఎదురైంది. రెండ్రోజుల పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీ ప్రాణానికి హాని ఉందంటూ ఓ లెటర్ వెలుగులోకి వచ్చింది. కేరళ బీజేపీ చీఫ్ కె సురేంద్రన్‌ను ఈ లేఖ రావడం సంచలనం కలిగించింది. ఎర్నాకులం

02

# పీఎస్ఎల్వీ సి-55 సక్సెస్

**ప్రజా తపన ,నెల్లూరు:**



హరికోట నుంచి పీఎస్ఎల్వీ సి-55 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. క్షణాల్లో నిప్పులు చిమ్ముకుంటూ రోదసిలోకి వెళ్లిన రాకెట్ విజయవంతం అయ్యింది. సుమారు 26 గంటల కౌంట్‌డౌన్ తర్వాత పీఎస్ఎల్వీ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్.. సింగపూర్‌కు చెందిన 741 కిలోల బరువుగల టెలియోస్-2, 16 కిలోల లూమ్‌లైట్-4 ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టిందిటెలియోస్-2 ఉపగ్రహం సింగపూర్ ప్రభుత్వానికి చెందినది కాగా.. దీనిని వివిధ ఏజెన్సీల అవసరాలకు వినియోగించనున్నారు. లూమ్‌లైట్-4 ఉపగ్రహాన్ని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇన్ఫోకామ్ రీసెర్చ్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లోని శాటిలైట్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ సెంటర్ కలిసి అభివృద్ధి చేశాయి. సింగపూర్ ఇ-నావిగేషన్ సముద్ర భద్రతను పెంపొందించడం, ప్రపంచ షిప్పింగ్ కమ్యూనిటీకి ప్రయోజనం చేకూర్చనుంది.పీఎస్ఎల్వీ సీ-55 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షించారు ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్. ఇది పూర్తిగా వాణిజ్య పరమైనది. త్వరలో చంద్రయాన్-3, మిషన్ ఆదిత్య లాంటి అంతరిక్ష పరిశోధన కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు ఇస్రో చైర్మన్. ఒక రాకెట్ ప్రయోగాన్ని విజయవంతం చేసి నెల రోజులు పూర్తి కాకముందే.. ఇస్రో మరో రాకెట్ ప్రయోగించడం ద్వారా సరికొత్త రికార్డును సొంతం చేసుకుంది.

# ప్రాణ త్యాగానికైనా సిద్ధం

## ఈద్ సందర్భంగా మమత బెనర్జీ

**ప్రజా తపన ,కోల్‌కతా :**



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ శనివారం బీజేపీ ఏఐఎంఐఎం పార్టీలపై పరోక్ష విమర్శలు చేశారు. తాను దేశం కోసం ప్రాణ త్యాగం చేయడానికైనా సిద్ధమేనని, దేశాన్ని విభజించడానికి మాత్రం అనుమతించేది లేదని చెప్పారు. ఆమె కోల్‌కతాలో ఈద్ ఉల్ ఫితర్ ప్రార్థనలు చేస్తున్నవారిని ఉద్దేశించి మాట్లాడారు.మమత ప్రత్యక్షంగా ఎవరి పేరును ప్రస్తావించకుండా

02

# చాపకింద నీరులా వ్యాపిస్తున్న కరోనా

**ప్రజా తపన ,న్యూఢిల్లీ:**



దేశవ్యాప్తంగా కరోనా కేసులు చాపకింద నీరులా పెరుతుగున్నాయి. కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం నిన్న దేశవ్యాప్తంగా 12,193 కొత్త కేసులు, 42 మంది కోవిడ్ బారిన పడి మృతిచెందారు. 10,765 మంది కరోనా నుంచి కోలుకొని డిశ్చార్జ్ అవ్వగా.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 67,556 యాక్టివ్ కేసులు ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. రోజువారీ కరోనా కేసులు

02

ప్రజా తపన
prajathapana.com

# అట్టహాసంగా గంగా పుష్కరాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటున్నారు నిర్వాహకులు. భారతీయ కాలమానం ప్రకారం పుష్కరం అంటే 12 సంవత్సరాలు. ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి భారతదేశంలోని 12 ముఖ్యమైన నదులన్నింటికీ 'పుష్కరాలు' వస్తాయి. పుష్కర సమయంలో ఆయానదుల్లో స్నానం చేస్తే ప్రత్యేక పుణ్యఫలం ప్రాప్తిస్తుందని భారతీయులు భావిస్తారు. బృహస్పతి ఆయా రాశులలో ప్రవేశించినప్పుడు ఆయానదికి పుష్కరాలు వస్తాయి. బృహస్పతి ఆ రాశిలో ఉన్నంతకాలం ఆ నది పుష్కరంలో ఉన్నట్టే. పుష్కరకాలం సాధారణంగా ఒక సంవత్సరం పాటు ఉంటుంది. అయితే.. పుష్కరకాలంలోని మొదటి పన్నెండు రోజులను ఆది పుష్కరం అని, చివరి పన్నెండు రోజులను అంత్య పుష్కరం అని వ్యవహరిస్తారు. ఈ మొదటి, చివరి పన్నెండు రోజులు మరింత ప్రత్యేకమైనవిగా భావిస్తారు. గంగా పురస్కరాల నేపథ్యంలో కాశీకి ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. సికింద్రాబాద్, ప్రయాగ్‌రాజ్, వారణాసి మీదుగా రక్సోల్ వరకు ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ఏప్రిల్ 23, 30, మే 7 తేదీల్లో ఆయా మార్గంలో ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. తిరుపతి, ప్రయాగ్‌రాజ్, వారణాసి మీదుగా దానాపూర్ వరకు ఏప్రిల్ 22, 29, మే 6 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. అలాగే.. గుంటూరు, ప్రయాగరాజ్ మీదుగా బెనారస్ వరకు ఏప్రిల్ 22, 29, మే 6 తేదీల్లో ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. మొత్తంగా.. భారతీయ సాంస్కృతిక వైభవంలో యుగాలుగా తన ప్రత్యేకతను చాటుకున్న గంగానది 12రోజులపాటు పుష్కరశోభను సంతరించుకోనుంది.

# మంజీరాలో పుష్కర స్నానం ఆచరించిన కేసీఆర్

**మెదక్ :**



పుష్కర కాలానికి ఒకసారి వచ్చే అతిపెద్ద పండుగ ప్రారంభమైంది. 12 సంవత్సరాలకొకసారి నిర్వహించే గంగా పుష్కరాల కోసం భక్తులు బారులు తీరుతున్నారు. బృహస్పతి మేషరాశిలో ప్రవేశించినప్పుడు (మేష రాశిలో గురు సంక్రమణం) గంగా పుష్కరాలు ప్రారంభమవుతాయి. గంగానది ప్రవహించే ప్రతిచోటా ఈ పుష్కరాలు జరుగుతాయి. అయితే, గంగోత్రి, రుషికేశ్, హరిద్వార్, వారణాసి, ప్రయాగరాజ్‌లో గంగా పుష్కరాలు అట్టహాసంగా సాగుతాయి. అయితే, ఇక్కడ మన తెలంగాణలోనూ గంగాపుష్కరాలు జరిగే పవిత ప్రదేశం ఒకటి ఉంది. అది మెదక్ జిల్లాలో.. మెదక్ సమీపంలోని పేరూరులో మంజీరా నదిలో గరుడ గంగ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. మంజీరా నదికి పూజలు చేసి పుష్కర వేడుకలను రంగంపేట పీఠాధిపతి మాధవనందా స్వామి ప్రారంభించారు. మెదక్ జిల్లా మెదక్ మండలం పేరూరు సమీపంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న గరుడ గంగా మంజీరా నదిలో స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సరస్వతి మాత సన్నిధికి విచ్చేసిన మాదానంద సరస్వతికి నిర్వాహకులు దోమల రాజమౌళి శర్మ గుణాకర శర్మ మహేష్ శర్మల ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు అనంతరం అమ్మవారికి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంజునాథ స్వామిని అభిషేకించారు. ఈ సందర్భంగా పుష్కర దేవతకు 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్సీ, సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్‌రెడ్డి దంపతులు పుణ్యస్నానాలు ఆచరించారు. మంజీరా తీరంలో పుష్కరాలు నిర్వహించడం ఇది రెండోసారి. 2011లో తొలిసారి ఇక్కడ పుష్కరాలు నిర్వహించారు. అప్పుడు కేసీఆర్ పుష్కరాల్లో పాల్గొన్నారు. ఒకప్పుడు మంజీరాను గరుడ గంగా అని పిలిచేవారు. పేరూరులోని ఈ ప్రాంతానికి పురాణాలతో సంబంధం ఉంది. ఈ ప్రాంతంలో గరుడ గంగా ఉత్తరవాహినిగా ప్రవహిస్తుంది. ఇక్కడ మూడు అడుగుల గొయ్యి తవ్వితే విభూది లభిస్తుందని అంటారు.

# మళ్లీ మోడీనే

(మొదటిపేజీ తరువాయి)

మరోసారి గెలిచి మూడోసారి కేంద్రంలో పాగావేయాలని మోదీ యోచిస్తున్నారు. అయితే ప్రతిపక్షాలు ఒక్కతాటిపైకి వచ్చేందుకు యత్నిస్తున్నాయి. దీంతో 2024 లోక్‌సభ ఎన్నికలు పోటీపోటీగా మారబోతున్నాయని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఈఏడాదిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో విజయాలను బట్టి దేశవ్యాప్తంగా ఓటరు నాడి ఎలా ఉంటుందో తేలిపోతుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే గెలిచేదెవరు. రాజకీయంగా ఇప్పుడు ఆసక్తి పెంచుతున్న అంశం ఇది. ఇదే అంశం పైన టైమ్స్ ఆఫ్ ఇండియా, నవ్ భారత్ సంస్థ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో ఆసక్తి కర అంశాలు బయటకు వచ్చాయి. లోక్‌సభకు ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మళ్లీ గెలిచేది బీజేపీయేనని సర్వే తేల్చింది. టైమ్స్ ఆఫ్ ఇండియా, నవభారత్ సంయుక్తంగా చేపట్టిన సర్వలో.. సర్వేలో ప్రధానంగా ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయనే అంశం పైన పబ్లిక్ మూడ్ తెలుసుకొనే ప్రయత్నం చేసారు. ప్రధాని మోడీ పాపులారిటీ చెక్కుచెదరకుండా అలాగే కొనసాగుతోందని సర్వేలో తేలింది. ప్రధాని మోడీ పనితీరు పట్ల తాజాగా 72% మంది సంతృప్తి వ్యక్తం చేశారని వెల్లడైంది. ఎన్డీఏ ప్రభుత్వం పట్ల 2022 ఆగస్ట్ లో 56 శాతం మందే సంతృప్తి వ్యక్తంచేయగా తాజాగా గవర్నమెంట్ అప్రూవల్ రేటింగ్ 11 శాతం పెరిగింది

# కరీంనగర్ హసన్ పర్తి రైల్వే లైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**కరీంనగర్ :**

ఉత్తర తెలంగాణ వాసులకు శుభవార్త చెప్పింది కేంద్రం. దశాబ్దాలకు పైగా పెండింగ్ లో ఉన్న కరీంనగర్ ? హసన్ పర్తి కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం సానుకూలత వ్యక్తం చేసింది. అందులో భాగంగా కొత్త రైల్వే లేన్ నిర్మాణానికి సంబంధించి యుద్ధ ప్రాతిపదికన రీ సర్వే చేసి నివేదిక సమర్పించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధికారులను ఆదేశించారు. సర్వే నివేదిక వచ్చిన అనంతరం నిధులు కేటాయింపుతోపాటు, రైల్వే లేన్ నిర్మాణ పనులను ప్రారంభంపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రైల్వే శాఖ మంత్రి అశ్వీని వైష్ణవ్ ను కలిసి కరీంనగర్ ? హసన్ పర్తి రైల్వే లేన్ నిర్మాణానికి సంబంధించి వినతి పత్రం అందజేశారు. దీంతోపాటు సిద్ధిపేట జిల్లాలోని కొమరవెల్లిలో రైలు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ ప్రాంతంలో స్టేషన్ ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ లోని ఐటం నెంబర్-11 ప్రకారం తెలంగాణకు ఈ అభివృద్ధి జరగాలన్నారు ఎంపీ బండి సంజయ్. 2013లో ఈ రైల్వే లేన్ నిర్మాణానికి సంబంధించి సర్వే చేసినప్పటికీ సరైన నిర్ణయం తీసుకోని కారణంగా రైల్వే లైన్ అంశంలో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది. దాదాపు 62 కి.మీల మేరకు పనులు సాగే కరీంనగర్ ? హసన్ పర్తి ఈ రైల్వే లేన్ నిర్మాణం పూర్తయితే ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రజలకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఉత్తర తెలంగాణలోని గ్రానైట్ ఇండస్ట్రీ తోపాటు వరి, పప్పు ధాన్యాలు, పసుపు పంట ఉత్పత్తుల రవాణా మరింత సులువు అవుతుంది. రైల్వేశాఖ ఇచ్చే నివేదిక ఆధారంగా త్వరలో వచ్చే నెలలో ప్రారంభించేందుకు తమ వంతు కృషి చేస్తానని కేంద్రమంత్రి హామీ అశ్వినీ వైష్ణవ్ ఇచ్చారు. అట్లాగే సిద్ధిపేట జిల్లా కొమరవెల్లిలో రైలు ఆగేలా ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. కేంద్రమంత్రి ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కరీంనగర్ ? హసన్ పర్తి రైల్వే లేన్ నిర్మాణ పనులు అతి త్వరలో ప్రారంభం కాబోతున్నాయని బండి సంజయ్ తెలిపారు. నిర్లక్ష్యం వల్లే ఈ రైల్వే లేన్ నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయని, దీనివల్ల ఇంతకాలం ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రజలు ఇబ్బంది పడ్డారని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి గత యేడాది ఫిబ్రవరి 11న ఇదే విషయంపై కేంద్రమంత్రిని కలిశారు బండి సంజయ్. హసన్‌పర్తి కరీంనగర్ రైల్వే లైన్ వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ఃజఆఉఇలోనే నిధులు కూడా కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. హసన్‌పర్తి- కరీంనగర్ రైల్వేలైన్ అంశాన్ని చాలా సార్లు రైల్వేశాఖ దృష్టి తీసుకొచ్చామని.. రైల్వే బోర్డు ఛైర్మన్‌కు వినతి పత్రం అందజేసినట్టు బండి సంజయ్ వివరించారు. ఈ కొత్త రైల్వే లైన్ సాధ్యాసాధ్యాలపై గతంలోనే దక్షిణ మధ్య రైల్వే అధికారులు సర్వే చేసి 2013లోనే బోర్డుకు నివేదిక పంపారని అప్పట్లోనే తెలిపారు

# ప్రధాని మోడీకి బెదిరింపు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతానికి చెందిన జోసఫ్ జెన్నీ అనే వ్యక్తి ఈ లెటర్ పంపినట్టు వెల్లడించారు సురేంద్రన్. ఈ దెబ్బతో ఒక్కసారిగా అంతా అలెర్ట్ అయ్యారు. ఏప్రిల్ 17న కేరళలోని బీజేపీ హెడ్‌క్వార్టర్స్‌కి ఈ లేఖ వచ్చింది. వెంటనే అప్రమత్తమైన సురేంద్రన్...పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ లెటర్‌ను అందజేశారు. "ప్రధాని మోదీకి ప్రాణహాని ఉందంటూ ఓ బెదిరింపు లేఖ వచ్చింది. వెంటనే పోలీసులకు ఈ సమాచారం అందించాం. ఇంటిలిజెన్స్ విభాగం కూడా సంచలన విషయాలు చెప్పింది. కొందరు ఉగ్రవాదులు కొన్ని రోజులుగా రాష్ట్రంలోనే మకాం వేసినట్టు స్పష్టం చేసింది. ప్రధాని మోదీ వచ్చే సమయానికే ఈ లెటర్ రావడం, నిఘా వర్గాలు కూడా అలా హెచ్చరించడం ఆందోళన కలిగిస్తోంది"ప్రస్తుతానికి ఈ లెటర్‌ని పంపిన వ్యక్తిని వెతికి పట్టుకునే పనిలో ఉన్నారు కేరళ పోలీసులు. అయితే ఆ తరవాత తేలిందేంటంటే ఆ వ్యక్తి తాను ఎలాంటి లేఖ రాయలేదని స్పష్టం చేశాడు. మొత్తానికి ఈ మిస్టరీ ఇంకా వీడలేదు. ఎవరు ఈ లేఖ పంపారు..? అదే పేరుతో ఎందుకు పంపించారు..? అన్నది తేలాల్సి ఉంది. ఇక మోదీ పర్యటన విషయానికొస్తే...ఏప్రిల్ 24వ తేదీన ప్రధాని కొచ్చికి చేరుకుంటారు. అక్కడే రోడ్‌షో నిర్వహిస్తారు. యూత్ మీటింగ్‌కు హాజరవనున్నారు. ఆ తరవాత రాష్ట్రంలోని 9 కీలక చర్చ్‌ల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. మరుసటి రోజు అంటే..ఏప్రిల్ 25న తిరువనంతపురం చేరుకుంటారు. అక్కడే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌కి పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నారు. సెంట్రల్ స్టేడియం నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి నేరుగా గుజరాత్‌కు వెళ్తారు. ఇటీవలే మూడు వందే భారత్ ట్రైన్‌లను ప్రారంభించారు ప్రధాని. సికింద్రాబాద్ నుంచి తిరుపతి మధ్యలో ఓ ట్రైన్ అందుబాటులోకి వచ్చింది. ఆ తరవాత తమిళనాడులోనూ ఓ ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు మొదలయ్యాయి. రాజస్థాన్‌లోనూ ఇటీవలే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వందేభారత్‌ను ప్రారంభించారు.

# చాపకింద నీరులా వ్యాపిస్తున్న కరోనా

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతుండటంలో ఆందోళన కలిగిస్తోంది. దేశవ్యాప్తంగా గడిచిన వారంలో కరోనా పాజిటివిటీ రేటు పెరిగింది. అంతకుముందు వారం 4.7గా ఉన్న పాజిటివిటీ రేటు గతవారం 5.5శాతానికి పెరగడం ఆందోళనకు గురిచేస్తోంది. అయితే కోవిడ్ సోకిన వారు ఆస్పత్రిలో చేరడం, మరణాల సంఖ్య తక్కువగా ఉన్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది.
కొన్ని రాష్ట్రాలు, జిల్లాల్లో అధికసంఖ్యలో కరోనా కేసులు నమోదు అవుతున్నందున కమ్యూనిటీ వ్యాప్తి పెరిగే అవకాశం ఉంది.కాబట్టి ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అవసరమైన ప్రజారోగ్య చర్యలు చేపట్టడం అవసర మని కేంద్రం భావించింది. ప్రారంభ దశలోనే ఇటువంటి ప్రమాదాలను గుర్తించి, నియంత్రించి నట్లయితే కరోనాను కట్టడి చేయొచ్చని కేంద్ర ఆరోగ్యశాఖ సూచించింది .మహమ్మారి నియంత్రణకు ఐదు అంచెల వ్యూహాన్ని అనుసరిం చాలని కేంద్ర ఆరోగ్య శాఖ భూషణ్ రాష్ట్రాలకు సూచించారు. టెస్ట్- ట్రాక్- ట్రీట్-వ్యాక్సినేషన్, కోవిడ్ నిబంధనలు పాటించాలని కోరారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ ఈ అంశాలపై కీలక దృష్టితో సత్వర సమర్థవం తమైన ప్రజారోగ్య చర్యలను ప్రారంభించడం చాలా కీలకమని తెలిపారు.

# ఘనంగా రంజాన్

**హైదరాబాద్ :**

రంజాన్ పర్వదినం సందర్భంగా మసీదులు, ఈద్గాల్లో ముస్లింలు ప్రార్థనలు చేస్తున్నారు. ప్రార్థనల్లో భారీ సంఖ్యలో ముస్లిం పాల్గొంటున్నారు. పండగ వేళలో ట్రాఫిక్ జామ్‌లు లేకుండా హైదరాబాద్ వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు పోలీసులు. పాతబస్తీ, మిరాలం ఈద్గా, చార్మినార్, మాసబ్ ట్యాంక్, సింకిద్రాంబాద్, రాణిగంజ్ పరిసరప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉన్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయి. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈద్ శు భాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ మన సమాజంలో సామరస్యం, కరుణ స్ఫూర్తి మరింత పెరగాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నాను అని ట్వీట్ చేశారు. ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ శనివారం పాట్నాలోని గాంధీ మైదానంలో ప్రార్థనలు చేశారు. ఇటుకను అందించిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా అందరికీ ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. 'ఈద్ ముబారక్, ఈ పవిత్రమైన పండుగ అందరికీ శాంతి, సంతోషం, శ్రేయస్సును తీసుకురావాలి.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా దేశ ప్రజలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. 'ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా, నేను తోటి పౌరులందరికీ, ముఖ్యంగా భారతదేశం, విదేశాల్లోని ముస్లిం సోదర సోదరీమణులకు నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రేమ, కరుణ పండుగ అయిన ఈద్, ఇతరులకు సహాయం చేయాలనే సందేశాన్ని ఇస్తుంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని సమాజంలో సోదరభావం, పరస్పర సామరస్యాన్ని పెంపొందించే మార్గంలో ముందుకు సాగాలని మనమందరం సంకల్పిద్దాం.ముస్లింలకు తెలంగాణ గవర్నర్ తమిళి సై కూడా ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర ఖురాన్ బోధనలు సమాజాన్ని తీర్చిదిద్దాయన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు చెప్పారు. రంజాన్ ఉపవాస దీక్షలతో క్రమశిక్షణ, దైవభక్తి పరిఢవిల్లుతోందన్నారు. సామరస్యానికి, సుహృద్భావానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండుగ. మనిషిలోని చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ ఇది. అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదర, సోదరీమణులందరికీ ఈద్ ముబారక్ అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

# వివేకాను చంపమని చెప్పారు

**కడప :**

ఏపీ మాజీ మంత్రి వివేకా హత్య కేసులో కీలక మలుపులు చోటు చేసుకుంటున్నాయి. శుక్రవారం వివేకానంద రెడ్డి రెండో భార్య షేక్ షమీమ్ ఆయన హత్యపై తొలి సారిగా స్పందించారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి గతంలో ఇచ్చిన స్టేట్‌మెంట్ తాజాగా ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. ఈ స్టేట్‌మెంట్‌ను దస్తగిరి అప్రూవర్‌గా మారక ముందు సీబీఐకి ఇచ్చాడు. తన స్టేట్‌మెంట్‌లో దస్తగిరి పలు కీలక విషయాలను బయటపెట్టాడు. తనకు 2016 నుంచే మాజీ మంత్రి వివేకానందారెడ్డితో పరిచయం ఉందన్న దస్తగిరి.. 2017 ఫిబ్రవరి నుంచి 2018 డిసెంబర్ వరకు వివేకాకు డ్రైవర్‌గా పనిచేశానన్నాడు.అలాగే 2017 ఎమ్మెల్సీ ఎన్నికల ఓటమిపాలైన ఆయన తనను దారుణంగా తిట్టాడని దస్తగిరి ఆ స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నాడు. అనంతరం కడపకు చెందిన రాధాకృష్ణమూర్తి, అతని కుమారుడు ప్రసాదమూర్తి మధ్య భూవివాదం గురించి 2017 నుంచి 2018 వరకు బెంగళూరులో సెటిల్మెంట్ కోసం తిరిగామని, ఆ ల్యాండ్ సెటిల్‌మెంట్ తర్వాత వివేకాకు రూ.8 కోట్లు వస్తాయని తమకు తెలుసని దస్తగిరి తెలిపాడు. అలాగే 2018లో వివేకానంద రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి బెంగళూరు వెళ్లారని దస్తగిరి తన స్టేట్‌మెంట్‌లో వివరించాడు.అయితే ఆ సమయంలో వివేకా, గంగిరెడ్డి మధ్య డబ్బు విషయంలో గొడవ జరిగిందని, ల్యాండ్ సెటిల్ చేసినందుకు 50% డబ్బు గంగిరెడ్డి అడిగారని దస్తగిరి పేర్కొన్నాడు. అందుకు వివేకారెడ్డి 'నన్నే వాటా అడిగేంత పెద్దోడివి అయ్యావా..?' అంటూ గంగిరెడ్డిని ప్రశ్నించారని, ఆ రోజు నుంచి వివేకా, గంగిరెడ్డి మధ్య మాటలు బంద్ అయ్యాయని దస్తగిరి తన స్టేట్‌మెంట్ ద్వారా తెలియజేశాడు. ఈ క్రమంలోనే 2019 ఫిబ్రవరిలో ఎర్ర గంగిరెడ్డి తనను పులివెందులకు పిలిపించి, వివేకానంద రెడ్డిని చంపాలని ఆయన చెప్పారని దస్తగిరి తెలిపాడు.

# ప్రాణ త్యాగానికైనా సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. తాను తన రాజకీయ ప్రత్యర్థుల ధనబలంపై పోరాడటంతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థలతో కూడా పోరాడవలసి వస్తోందని చెప్పారు. "బెంగాల్‌లో శాంతి కావాలి. అల్లర్లు వద్దు. దేశంలో విభజనలు వద్దు. కొందరు దేశాన్ని విభజించాలని కోరుకుంటున్నారు, విద్వేష రాజకీయాలు చేస్తున్నారు. నేను నా ప్రాణాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను, కానీ దేశంలో ఎలాంటి విభజనలను అనుమతించను" అని చెప్పారు.తన రాజకీయ ప్రత్యర్థుల ధన బలంతో పోరాడటానికి సిద్ధంగా ఉన్నానని మమత తెలిపారు. రాజకీయ దురుద్దేశాలతోనే టీఎంసీపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొలుపుతున్నారన్నారు. అయినప్పటికీ తాను తల వంచేది లేదన్నారు."బీజేపీ నుంచి డబ్బు తీసుకుని, ముస్లిం ఓట్లను చీల్చుతామని ఒకరు అంటున్నారు. బీజేపీ కోసం ముస్లిం ఓట్లను చీల్చే దమ్ము వాళ్లకు లేదని నేను చెప్తున్నాను" అని తెలిపారు. దేశంలో ఎవరు అధికారంలోకి రావాలో నిర్ణయించే ఎన్నికలు ఓ ఏడాదిలో రాబోతున్నాయన్నారు. విభజన శక్తులకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడతామని మనం శపథం చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ విభజన శక్తులను గద్దె దించాలన్నారు. మనం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో విఫలమైతే, అంతా నాశనమేనని హెచ్చరించారు .ఏఐఎంఐఎంను బీజేపీకి బీ-టీమ్ అని కొన్ని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.

ప్రజాతపన
prajathapana.com

# వివేకా హత్య కేసులో మనీలాండరింగ్ కోణం

**కడప :**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ వివేకానందరెడ్డి కేసు కీలక మలుపులకు కారణం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ కేసు ఇంతటితో ఆగదని.. ఇంకా పలువురు ప్రముఖులకు సీబీఐ నోటీసులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం ఊపందుకుంటోంది. అదే సమయంలో సీబీఐ ఈ హత్య ఘటనలో రూ. 40 కోట్ల సుపారీ చేతులు మారిందని ఆరోపిస్తోంది. అప్రూవర్ గా మారిన దస్తగిరి తనకు రూ. కోటి అందాయని చెబుతున్నారు. సునీల్ యాదవ్ కూ రూ. కోటి అందాయని సీబీఐ అధికారులకు ఆధారాలు లభించాయి. అసలు ఈ సొమ్మంతా ఎక్కడిదనే అంశంపై ఇప్పుడు సీబీఐ అధికారులు కూపీ లాగుతున్నారు. త్వరలో ఈడీ కూడా రంగంలోకి దిగవచ్చని చెబుతున్నారు.వైఎస్ వివేకానందరెడ్డి హత్య పూర్తిగా వ్యక్తిగత కక్షలతో సాగిందని వివాహేతర బంధాల కారణంగానే జరిగిందని అవినాష్ రెడ్డి గట్టిగా వాదిస్తున్నారు. అయితే హత్యలో పాల్గొన్న వారికి పెద్ద ఎత్తున డబ్బులు సమకూర్చారు. అది కూడా రూ.కోట్లలోనే. రూ. 40 కోట్ల డీల్ జరిగిందన్న విషయం బయటపడింది. కేవలం మాటల్లోనే కాదు ఈ నగదు



చేతులు మారిందని చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో సుపారీ ఇచ్చి మరీ వైఎస్ వివేకాను చంపించాల్సిన అవసరం ఏమిటనేది ఇప్పుడు కీలకంగా మారింది. దస్తగిరి తనకు రూ. కోటి అందాయని చెబుతున్నారు. సీబీఐ అధికారులు ఎవరి వద్ద నుంచి అందాయి.. .ఆ డబ్బులు ఎక్కడి నుంచి తీసుకు వచ్చారు ? అనేది బయటకు లాగుతున్నారు. ఈ డబ్బులు ఎవరు ఇచ్చారని తేలితే వారే సూత్రధారులు. అక్కడ బయటపడటానికి మరో మార్గం ఉండదు. తెలంగాణలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో కొన్ని లక్షల రూపాయలు చేతులు మారాయని ఫిర్యాదు రాగానే ఈడీ కేసు నమోదు చేసింది. సొంతంగా ఈసీఐఆర్ నమోదు చేసి విచారణ ప్రారంభించింది. నిందితుల్ని కస్టడీలోకి తీసుకుని ప్రశ్నిస్తోంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఈడీకి సీబీఐ అధికారులు మనీ లాండరింగ్ వివరాలు ఇచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు. రేపోమాపో ఈడీ రంగంలోకి దిగే అవకాశం ఉంది. చేతులు మారిన డబ్బును ఎలా సమీకరించారు. .ఎవరు తీసుకు వచ్చారు... ఎవరికి ఇచ్చారు..అనేది ఈడీ తేల్చేస్తే.. అసలు నిందితులెవరో స్పష్టత వస్తుంది. ఈ దిశగా ఇప్పటికే ఈడీ అంతర్గత దర్యాప్తు జరుగుతోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. సీబీఐ వైఎస్ వివేకా హత్య కేసును వీలైనంత వేగంగా తేల్చాలని అనుకుంటోంది. నిందితులు ఎన్ని పిటిషన్లు వేస్తున్నా.. సాంకేతిక ఆధారాలతో అన్నింటినీ కోర్టు ముందు పెట్టి నిందితులకు శిక్ష పడేలా చేయాలని లక్ష్యంతో ఉంది. నిజానికి ఈ కేసు సీబీఐకి ఓ చాలెంజ్ లాంటిది. సీబీఐపై ఎన్నో రకాల ఒత్తిళ్లు వచ్చాయి. అన్నింటినీ తట్టుకున్నారు. సాక్ష్యాలతో సహా నిందితుల్ని కోర్టు ముందు శిక్షపడేలా చేస్తే.. సీబీఐ విశ్వసనీయత మరింత పెరుగుతుంది. కేసు విచారణ ఇప్పటికే ఆలస్యం అయింది. అందుకే సుప్రీంకోర్టు విధించిన గడువులోపల విచారణ పూర్తి చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా కీలకమైన వ్యక్తులకూ నోటీసులు జారీ చేసే అవకాశాలు ఉన్నాయి.

# మూడో ఫ్రంట్ కు శరద్ పవార్ దూరం

**ముంబై :**

విపక్షాల ఐక్యత కోసం అలుపెరుగకుండా ప్రయత్నాలు చేస్తున్న శరద్ పవార్ ఇప్పుడు అదే విపక్ష కూటమికి దూరమౌతున్నారా? విపక్షాలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్న పారిశ్రామిక వేత్త అదానికి మద్దతుగా మాట్లాడుతున్నారు. దీంతో ఆయన రాజకీయ రూటు మారిందా అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.అదానీ, మోడీ నెక్సస్ పై విపక్షాలు విమర్శలు చేస్తుంటే.. పవార్ మాత్రం అదానీ, మోడీ సంబంధం, మోడీ విద్యార్హత తప్ప మరో సమస్యే లేదా అంటూ చిటపటలాడుతున్నారు. దీంతోనే ఆయన విపక్షాల ఐక్యతకు కాకుండా విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తున్నారా? కమలానికి దగ్గర కావడానికి ప్రయత్నిస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి.పరిశీలకులు సైతం అదే దారిలో విశ్లేషణలు చేశారు. ఆ అనుమానాలకూ, విశ్లేషణలకూ బలం చేకూర్చే విధంగా అదానీతో శరద్ పవార్ బేటీ అయ్యారు. పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ స్వయంగా ముంబైలోని శరద్ పవార్ నివాసానికి వెళ్లి మరీ భేటీ అయ్యారు. వీరిరువురి మధ్యా జరిగిన చర్చలేమిటన్నది పక్కకు పెడితే.. హిడెన్ బర్గ్ నివేదిక తరువాత అదానీపై వెల్లువెత్తుతున్న విమర్శలు, జేపీసీ కోసం విపక్షాల డిమాండ్ నూ పట్టించుకోకుండా కేంద్రం నిర్మొహమాటంగా అదానీకి మద్దతుగా నిలిచిన నేపథ్యంలో శరద్ పవార్, అదానీ బేటీ రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.పైపెచ్చు విపక్షాల విమర్శలను ఖండిస్తూ పవార్ అదానీకి మద్దతుగా నిలవడంతో ఈ భేటీ రాజకీయ ప్రాముఖ్యతను సైతం సంతరంచుకుంది. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో శరద్ పవార్ కేంద్రానికి మద్దతుగా నిలిచే అవకాశాలను కొట్టిపారే యలేమని పరిశీలకులు అంటున్నారు.

# ప్రజాప్రతినిధుల పేరుతో16 మంది వీఐపీ టిక్కెట్ల దందా

**తిరుమల :**

ఏలూరుకు చెందిన టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ షాబ్జీని తిరుమల తిరుపతి దేవస్థానం విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దర్శనాల పేరుతో భక్తుల నుండి అధిక మొత్తంలో నగదును వసూలు చేసినట్లుగా గుర్తించి ఏలూరు టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ షాబ్జి టిటిడి విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఫోర్జరీ ఆధార్ కార్డులతో ఇతర రాష్ట్రాలకు చేందిన భక్తులను ప్రోటోకాల్ దర్శనానికి తీసుకు వెళ్తున్నట్లు అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. తిరుమలలో వీఐపీల బ్రేక్ దర్శనానికి ఫుల్ డిమాండ్ ఉంటుంది. శ్రీనివాసుడిని అతి దగ్గరగా చూడాలన్న ఆశతో ప్రజాప్రతినిధులు, అధికారుల నుండి సిపార్సు లేఖలపై కొందరు విఐపి బ్రేక్ దర్శనాలు పొందుతుంటారు. సాధారణంగా విఐపి బ్రేక్ దర్శన టిక్కెట్ ధర రూ. 500 మాత్రమే. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కోటా ప్రకారం కేటాయిస్తూ ఉంటారు. విఐపి బ్రేక్ దర్శనం టిక్కెట్లను దళారులు పది వేల రూపాయలకు బ్లాక్‌లో విక్రయిస్తూ ఉంటారు. ద్వారా పొందాలంటే ఒక్కో బ్రేక్ దర్శనం టిక్కెట్ విలువ పది దళారులు తాము నిర్దేశించిన ధరలకు భక్తులకు దర్శన టోకెన్లను విక్రయిస్తుంటారు. గతంలో విఐపి బ్రేక్ దర్శనాల ఎల్1,ఎల్2,ఎల్3 దర్శనాలు ఉండేదవి. ప్రభుత్వం మారిన తర్వాత పాత విధానంను రద్దు చేస్తూ కేవలం విఐపి బ్రేక్ దర్శనంను మాత్రమే అమలు చేస్తూ వస్తున్నారు. ప్రోటోకాల్ కలిగిన వ్యక్తుల వెంట పది మంది నుండి 12 మందికి వెళ్ళే వెసులుబాటు కల్పిస్తుంది టిటిడి. దీనిని ఆసరాగా తీసుకున్న



కొందరు ప్రజాప్రతినిధులు తమ అత్యాశకు పోయి దర్శనాలను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా తమ దందాను ఎంచక్కా సాగిస్తున్నారు.. కొందరు స్వయంగా తామే వచ్చి తమతో వచ్చిన వారికి అన్ని మర్యాదలు సరిగ్గా అందేలా చూస్తున్నారు.. ఇలాంటి వారి కోవకు చేందిన వారే ఏలూరు టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ.. గత కొంత కాలంగా సిపార్సు లేఖలు అధికంగా ఇస్తున్నట్లు గుర్తించారు టీటీడీ ఈవో కార్యాలయ సిబ్బంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ లేఖలపై నిఘా ఉంచాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వరుసగా తిరుమలకు రావడం, ప్రోటోకాల్ దర్శనం కావాలని టీటీడీ అధికారులపై ఒత్తిడి తీసుకుని రావడంతో ఎమ్మెల్సీపై అనుమానం మొదలైంది.. గురువారం నాడు తిరుమలకు వచ్చిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ తనతో వచ్చిన 14 మందికి విఐపి ప్రోటోకల్ బ్రేక్ ఇవ్వాలని ఈవో కార్యాలయానికి అభ్యర్థన పంపారు.. అయితే ఇందులో ఎమ్మెల్సీతో పాటుగా మరో పది మందికి మాత్రమే ప్రోటోకాల్ దర్శనం ఇవ్వగా మిగిలిన వారికి సాదారణ బ్రేక్ దర్శనం ఇచ్చారు. ఎమ్మెల్సీ వ్యవహార శైలిపై నిఘా ఉంచిన టీటీడీ విజిలెన్స్ ఎమ్మెల్సీతో వచ్చిన వారి ఐడి ప్రూఫ్ వెరిఫికేషన్ చేశారు. దింతో టీచర్స్ ఎమ్మెల్సీ టిక్కెట్ల దందా బట్టబయలు అయింది. వచ్చిన 10 మందిలో ఆరుగురు వ్యక్తులు ఫోర్జరీ ఆధార్ కార్డులతో దర్శనానికి తీసుకువెళ్తున్నట్లు టీటీడీ విజిలెన్స్ వింగ్ అధికారుల తనిఖీల్లో తేలింది. నకిలీ ఆధార్ లో చిరునామా హైదరాబాద్ ఉంటే, వారి ఒరిజినల్ ఆధార్ లో మాత్రం కర్ణాటక రాష్ట్రం వివరాలు ఉండడంను గుర్తించారు..6 మంది దర్శనం కోసం లక్షా 5 వేల రూపాయలను ఎమ్మెల్సి డ్రైవర్ ఖాతాకు భక్తులు నగదు బదిలీ చేసినట్లు గుర్తించామని విజిలెన్స్ అధికారులు ప్రకటించారు. నెల రోజులు వ్యవధిలో ఎమ్మెల్సీ షేక్ షాబ్జి 19 సిఫార్సు లేఖలు జారి చేశారని వెల్లడించారు.ప్రతి సిఫార్సు లేఖను ఎమ్మెల్సీ ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులుకే ఇచ్చినట్లు టీటీడీ విజిలెన్స్ వింగ్ అధికారులు గుర్తించారు. అదుపులోకి తీసుకున్న వారి తిరుమల వన్ టౌన్ పోలీసులకు కేసు అప్పగించడం జరిగిందని గిరిధర్ తెలిపారు.. శ్రీవారి దర్శనాల పేరుతో భక్తులను మోసం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.. దళారులను నమ్మి మోస పోవద్దని ఆయన కోరారు.. టీటీడీ అఫీషియల్ వెబ్సైట్లోనే దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని భక్తులను ఆయన విజ్ఞప్తి చేశారు..దళారులుకు సిఫార్సు లేఖలు జారి చేస్తున్న 16 మంది ప్రజాప్రతినిధుల సమాచారం ఇప్పటికే టిటిడి సేకరించినట్లు సమాచారం. ఎమ్మెల్సీ షేక్ షాబ్జి ఘటన తరహాలోనే అక్రమాలకు పాల్పడుతున్న ప్రజాప్రతినిధులు పై చర్యలకు టీటీడీ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# తెలుగు ఓటర్లే కీలకం

**బెంగళూరు :**

కర్ణాటక ఎన్నికల్లో తెలుగు మూలాలున్న ఓటర్లు కీలకంగా మారారు. తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లి స్థిరపడిన వారు కాకుండా తరతరాలుగా కర్ణాటక స్థిరపడిన తెలుగు మూలాలు ఉన్న వారు కూడా కీలకంగా ఉన్నారు. ఇప్పుడు వారి ఓట్లు గెలుపోటముల్ని నిర్దేశించబోతున్నాయి. అందుకే అన్ని రాజకీయ పార్టీలు తెలుగు ఓటర్లపై పక్రత్యేక దృష్టి పెట్టాయి. తెలుగు రా,?ట్రాల నుంచి నేతల్ని ప్రచారానికి పిలవడంతో పాటు సామాజికవర్గ సమీకరణాల్ని చూసుకుంటూ నేతల ప్రచార షెడ్యూల్ ఖరారు చేస్తున్నారు. మెజార్టీకి అవసరమైన ఓట్లు తెలుగు ఓటర్లు ఇస్తారని నమ్మడంతో ఈ సారి అన్ని పార్టీలు తెలుగు ఓటర్లుపై ఎక్కువ దృష్టి పెట్టాయి.కర్ణాటక లో 224 అసెంబ్లి సీట్లుండగా ఏడు జిల్లాల్లోని దాదాపు 60 స్థానాల్లో తెలుగు మాట్లాడే ఓటర్లు 60 శాతానికి పైగా ఉన్నట్టు చెబుతున్నారు. కోలార్ జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో మెజార్టీ ఓటర్లు తెలుగు మూలాలు ఉన్న వారేనని భావిస్తున్నారు. బెంగళూర్ రూరల్ జిల్లాలోని నాలుగు జిల్లాలో 65 శాతం, బెంగళూర్ అర్బన్ జిల్లాలోని 28 నియోజక వర్గాల్లో 49 శాతం తెలుగు మాట్లాడే ఓటర్లున్నారు. రాయచూర్ జిల్లాలో ఏడు సీట్లలో 64 శాతం, బళ్లారిలో 9 అసెంబ్లి సీట్లలో 63 శాతం, చిక్ బల్లాపూర్ జిల్లాలో 5 సీట్లలో 49 శాతం కొప్పల్ జిల్లాలో 5 అసెంబ్లి సీట్లలో 43 శాతం తెలుగు ఓటర్లున్నారని రాజకీయ పార్టీలు లెక్కలు వేస్తున్నాయి. ఇక తెలంగాణలోని జహీరాబాద్‌కు పొరుగున ఉన్న బీదర్ నియోజక వర్గంలో ఉన్న ఓటర్లలో 20 శాతం మంది సంగారెడ్డి జిల్లాకు చెందిన వారే. వీరి ఓట్లు కీలకం కానున్నాయి. తెలుగు ఓటర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్, బీజేపీ , జనతాదళ్‌సెక్యులర్ పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. తెలుగు మాట్లాడే ఓటర్ల నియోజకవర్గాలను గుర్తించి అక్కడ తెలుగు వారిని ... పలుకుబడి ఉన్న నేతలను అభ్యర్థులుగా ఎంపిక చేసి వారితో నామినేషన్లు వేయించినట్టు తెలుస్తోంది. ఎన్నికల్లో తెలుగు మాట్లాడే నేతలకు డిమాండ్ బాగా పెరిగినట్లయింది. తెలుగు ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు రెండు జాతీయపార్టీలు కాంగ్రెస్, బీజేపీ ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన కీలక నేతలను ప్రచార బరిలోకి దింపాయి. జనతాదళ్ సెక్యులర్ తరపున భారత రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రచారం నిర్వహిస్తారని చెబుతున్నారు. అయితే ఇంకా ఖరారు కాలేదు. తెలంగాణకు పొరుగున ఉన్న గుల్బర్గా, రాయచూర్,కొప్పోల్,బీదర్ తో పాటు బెంగళూర్ అర్బన్ లో నిర్వహించే ప్రచార సభలు, రోడ్ షోలలో పాల్గొనే అవకాశం ఉందని చెబుతున్నారు. తెలుగువారిని ఆకట్టు కోవడానికి టాలీవుడ్ తారల్ని రంగంలోకి దించాలనే ఆలోచన కొన్ని పార్టీలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. పవన్ కల్యాణ్‌తో ప్రచారం చివరి రెండు, మూడు రోజులు సభలు, రోడ్ షోలు నిర్వహించాలని బీజేపీ ప్రణాళికలు వేస్తోంది. కాంగ్రెస్ పార్టీ కూడా అలాంటి ప్రయత్నాలు చేస్తోంది. తెలుగు ప్రజలకు బాగా గుర్తుండే కన్నడ నటులతో ప్రచారం చేయించా లనుకుంటున్నారు. మొత్తంగా తెలుగు ఓటర్లు అందరూ ఎటు వైపునిలబడితే అటు వైపు విజయం ఉంటుందన్న ప్రచారం అయితే సాగుతోంది.

# తుది మెరుగులు దిద్దుకుంటున్న సచివాలయం

## 26 నెలల్లో పూర్తయిన నిర్మాణం

**హైదరాబాద్ :**

తెలంగాణ నూతన సచివాలయం నిర్మాణం వెనక ఎన్నో సవాళ్లు!. పాత భవనాలను కూల్చటం దగ్గర్నుంచి స్థలాన్ని ఒక రూపులోకి తెచ్చేందుకు అధికారులు పెద్ద కసరత్తే జరిగింది. కొన్ని ప్రాంతాల్లో వదులు నేలలు కలవరం పెట్టించాయి. మరికొన్ని చోట్ల బండరాళ్లు అడ్డంకిగా మారాయి. మరికొన్ని చోట్ల భూమి బొగ్గుడంపు మాదిరిగా కుంగిపోయింది. వాటన్నింటినీ పరిష్కరిస్తూ బలమైన పునాదులు వేశారు. ముఖ్యంగా పాత భవనాల కూల్చివేత అది పెద్ద సవాల్. ఆ సమయంలో అక్కడున్న భూగర్భ విద్యుత్తు లైన్ల తొలగింపు తలనొప్పిగా మారింది. ఎలాంటి ప్రమాదం జరగకుండా ఈ పనులను పూర్తిచేశారు. లైవ్ వైర్ డిటెక్షన్ విధానంలో కరెంటు తీగలను సురక్షితంగా తొలగించారు. ఇండో-పర్షియన్-అరేబియన్ నిర్మాణాల కలబోత-కొత్త సచివాలయం! ప్యాలెస్‌లు, ఆలయ గోపురాల తరహాలో ఉంటుంది. ఇలాంటి నిర్మాణాలు కొలిక్కి రావాలంటే కనీసం నాలుగేళ్లకు పైగా పడుతుందని నిపుణుల అంచనా. కానీ ఈ సచివాలయం పనులు ప్రారంభమైన నాటి నుంచి 26 నెలల్లోనే పూర్తి చేయటం రికార్డు! సచివాలయ ఆకృతుల రూపకల్పనలో సీఎం కేసీఆర్ అనేక గంటల సమయాన్ని కేటాయించారు. ఆర్కిటెక్టులు, ఇంజినీర్లతో అనేక దఫాలుగా చర్చించారు. అలా డిజైన్‌ని ఫైనలైజ్ చేశారు. నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలను మంత్రి ప్రశాంత్‌రెడ్డి దగ్గరుండి



చూసుకున్నారు. సీఎం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా రోజువారీ ప్రణాళికలు రచించుకుని.. అవి ఎప్పటికప్పుడు పూర్తయ్యేలా శ్రద్ధ వహించారు. ప్రతి అంతస్తులో జరిగే పనుల వివిధ రకాల బృందాలకు అప్పగించి పర్యవేక్షించారు. వివిధ శాఖల అధికారుల కోసం ఆ ప్రాంగణంలోనే ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దాంతో వర్క్ ఈజీ అయింది.సచివాలయ భవనంలో మరో ప్రత్యేకత వాటర్ సప్లయ్! భవనం సమీపంలో భారీ సంపును ఏర్పాటు చేశారు. వర్షం పడితే ఒక్క చుక్క కూడా వేస్ట్ కాదు. ప్రతీ డ్రాప్ సంపులోకే వెళుతుంది. భూగర్భ నీటి సంపు సామర్థ్యం 565 లీటర్లు. అక్కడి నుంచి నీరు అన్ని ఫ్లోర్లకు సరఫరా అవుతుంది. నీటి వినియోగం రోజుకు 125 కిలో లీటర్లని అంచనా వేశారు.. ఇటీవల వర్షాలు కురిసిన సమయంలో సుమారు అడుగున్నర ఎత్తున వర్షపు నీరు సంపులోకి చేరటాన్ని అధికారులు గుర్తించారు. ప్రాంగణానికి మరింత వన్నె తెచ్చేందుకు రెండు భారీ ఫౌంటెయిన్లను నిర్మించారు. పార్లమెంటులో ఉన్న మాదిరిగానే అదే ఎత్తు, అదే వైశాల్యంతో ఏర్పాటు చేశారు. పార్లమెంటులో ఉపయోగించిన రెడ్ శాండ్ స్టోన్‌తోనే నిర్మించటం విశేషం. ఒక్కో ఫౌంటెయిన్ ఎత్తు 28 అడుగులు. వైశాల్యం 58 అడుగులు. సచివాలయంలో పచ్చదనానికి ఎనిమిది ఎకరాల వరకు కేటాయించారు. ఎక్కువ భాగం లాన్స్ రూపంలోనే కనిపిస్తుంది. ముందు భాగమంతా ఆకుపచ్చ తివాచీ పరిచినట్టుగా ఉంటుంది. భవనం మధ్యలో కూడా పచ్చదనం పరుచుకుంటుంది. లాన్స్‌కు నలుదిక్కులా దేవదారు లాంటి వృక్షాలను పెంచుతున్నారు. సచివాలయం గ్రౌండ్ ఫ్లోర్లో గ్రంథాలయం ఉంది. తెలుగుతల్లి ఫ్లైఓవర్ వైపు 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంటీన్ నిర్మించారు. దానికి ఆనుకుని ఓపెన్ కిచెన్ ఉంటుంది. అటు పక్కనే బ్యాంకు, ఏటీఎంలకు కొంత స్థలాన్ని కేటాయించారు.సచివాలయానికి తూర్పు వైపు నిర్మించిందే మెయిన్ ఎంట్రన్స్. సీఎం, మంత్రులు, ఉన్నతాధికారుల కోసం ఈ గేట్ తెరుచుకుంటుంది. ఈశాన్యంలో ఉన్న గేటు నుంచి కింది స్థాయి అధికారులు, సిబ్బంది వస్తారు. ఆగ్నేయం వైపు ఏర్పాటు చేసిన ద్వారం నుంచి సందర్శకులను అనుమతిస్తారు. వాయవ్యంలో నిర్మించిన వాకిలిని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వాడుతారు. ప్రధాన భవనం ముందు శాశ్వత హెలిప్యాడ్ ఉంటుంది.ఇకపోతే, సచివాలయంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ ప్రార్థన మందిరాలను నిర్మించారు. పాత సచివాలయం కంటే విశాలంగా, సుందరంగా ఉంటాయవి. ఆయా మత పెద్దల ఆకాంక్షల మేరకు నిర్మాణాలు చేయించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. దేవాలయం, మసీదు, చర్చి కోసం సుమారు 9వేల చదరపు అడుగులను కేటాయించారు.

# ఈ సమ్మర్ హాట్ గురూ...

**హైదరాబాద్ :**

కంటికి కనిపించకుండానే కోట్లాది మందిని కబళించింది కోవిడ్ మహమ్మారి. అలాగే కనిపించని మరో మహమ్మారి మన దేశాన్ని ఆక్రమించబోతోంది. ఆ భూతం పేరు ఎండవేడిమి. హీట్‌వేవ్ కారణంగా ఇండియాలో దాదాపు 90 శాతం భూభాగం డేంజర్‌జోన్‌లో పడింది. దీనికి కారణం ఏంటనే కోణంలో శాస్త్రవేత్తలు ఆరా తీస్తున్నారు. ఆలోగానే? మిడ్ సమ్మర్లోకి ఎంట్రీ ఇస్తున్నాం మనం. మండే సూరీడు ఈసారి ఎంతమంది ఉసురు తియ్యబోతున్నాడో ఊహించుకోడానికే జడుసుకోవాల్సిన పరిస్థితి. నడినెత్తినెక్కి సూరీడు చేస్తున్న నాట్యానికి పిట్టల్లా రాలిపోతున్నారు జనం. నవీ ముంబైలో ఒక బహిరంగ సభలో ఏకంగా 14 మందిని మింగేసింది వడదెబ్బ. 600 మంది ఇప్పటికీ ఆస్పత్రి బెడ్లమీదే ఉన్నారు. 42 డిగ్రీల మండుటెండ? మిడతల్లా మాడిపోయిన జనం?. ఎండాకాలం చరిత్రలో ఇదే ఆల్ టైమ్ రికార్డ్.ఏప్రిల్ నెలలోనే ఇంత యాతనుంటే?. ఇక మే, జూన్ మాసాలొస్తే పరిస్థితేంటి? మంటల్లో మునుగుడేనా? మనుగడ లేనట్టేనా? ఇండియాలో ఎండలు ఈసారి మామూలుగా ఉండవనే ముందస్తు హెచ్చరికలు భారీగా వినిపిస్తున్నాయి. రాబోయే ఎండలపై కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ చేసిన ఒక అధ్యయనాన్ని చూస్తే గుండెలు మండిపోవడం ఖాయమంటున్నారు నిపుణులు. రాబోయే మూడునెలల్లో ఇండియాలో హీట్ వేవ్‌లు



తరచుగా తీవ్రరూపం దాల్చబోతున్నాయి. వాతావరణంలో మార్పులే దీనిక్కారణం అంటున్నారు. దేశం మొత్తంలో 90 శాతం ప్రాంతాలు హీట్ వేవ్‌ల ప్రభావంతో ప్రమాదంలో పడబోతున్నాయి.రాజధాని ఢిల్లీ ఇప్పటికే డేంజర్ జోన్‌లో ఉంది. హస్తినను ఈసారి సమ్మర్ సీజన్ తీవ్రంగా దెబ్బతియ్యబోతోంది. వాతావరణ మార్పుల కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలు సక్సెస్ కాకపోవడంతో భారీ ఉష్ణోగ్రతల తాకిడి నుంచి తప్పించుకోలేకపోతోంది ఢిల్లీ నగరం. ఎండ తీవ్రత అనేది ఏ స్థాయిలో విరుచుకుపడుతుందో తెలియాలంటే ఒక్కసారి చరిత్ర పేజీలు తిరగెయ్యాల్సిందే. 1971 నుంచి ఇప్పటివరకూ దాదాపు 706 సార్లు వడదెబ్బతో తల్లడిల్లింది ఇండియా. గత 30 ఏళ్లలో భారీ ఉష్ణోగ్రతల తాకిడికి 24 వేల మంది మృత్యువాతన పడ్డారు. ఈ ఏడాది వేసవి మరణాలు పెరిగినా పెరగొచ్చంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఆకాల వర్షానికి పంట నీటిపాలు

**సూర్యాపేట**

శుక్రవారం రాత్రి సూర్యాపేట పరిసర ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షం రైతుల కంట్లో కడగండ్లు నింపాయి , ఉరుములు , ఈదురు గాలులతో సుమారు గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం కురిసింది . భారీ వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు నెలకొరగగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్లో ధాన్యం తడిసిపోయింది . నిన్న ఒక్క రోజే సుమారు 50 వేల పై చిలుకు బస్తాలు రావడంతో ధాన్యం కాంటా ఆలస్యం కాగా ఇంకా కొంతమంది రైతుల ధాన్యం కుప్పలు అలాగే ఉండటంతో కాంటా వేసిన బస్తాలు సహా ధాన్యం రాశుల కిందకు వర్షం నీరు చేరి తడిసిపోయాయి . ఆకాలంగా వర్షం రావడంతో మార్కెట్లో రైతుల ధాన్యం వర్షం ధాటికి కొట్టుకుపోయింది దీంతో తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు . సూర్యాపేట జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల ఇటీవల ప్రారంభమైన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సైతం వర్షం కారణంగా ధాన్యం రాశుల్లోకి నీరు చేరడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు

## గర్భస్థ శిశువు మృతి..బంధువుల అందోళన

**సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విషాదం నెలకొంది. ఈ నెల 20న పురిటి నొప్పులతో గర్భిణి రేణుక డెలివరీ కోసం వచ్చింది. నార్మల్ డెలివరీ చేస్తామని ఆపరేషన్ చేయలేదు. నిన్న మధ్యాహ్నం 12 గంటల నుంచి రేణుక ఆరోగ్యం విషమించింది. రేణుక పరిస్థితి విషమించడంతో డాక్టర్లు శిశువుని బయటకు తీసారు. అప్పటికే మగ శిశువు మృతి చెందడంతో బంధువులు అందోళనకు దిగారు. డాక్టర్ల నిర్లక్ష్యంతోనే బాబు చనిపోయాడని ఆరోపించారు. విషమంగా రేణుక పరిస్థితి వుంది. ఐసీయూలో చికిత్స చేస్తున్నారు. ఆస్పత్రి ముందు బంధువులు ఆందోళనకు దిగారు. దాంతో పోలీసులు భారీగా మోహరించారు.

## ముస్లీంలకు మటన్ పంపిణీ

**గన్నవరం**

హనుమాన్ జంక్షన్ శివారు అప్పనవీడు లో ముస్లిం సోదరులకు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు రేషన్ కార్డు ఉన్న వారికి కార్డు కి 1 కేజీ మట్టన్ చింతమనేని చేతుల మీదగా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏమ్.ఎల్.ఏ వల్లభనేని వంశీ,మీ మీద కామెట్స్ చేసేరు దాని పై ఏమ్ మాట్లాడుతారు అంటే వంశీ ఒక పీకుడు గాడు,వాడి గురించి నేను తరువాత మాట్లాడతానని అన్నారు.

రంజాన్ లాంటి శుభదినం రోజు అలాంటి వాడి గురించి ఇప్పుడు వద్దు. వాడు ఎంత పికుడు గాడో తరువాత చెబుతానని అన్నారు.

## రోడ్డు ప్రారంభించిన ఎంపి, మంత్రి

**అనకాపల్లి**

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ 82 వార్డులో కోటి 40 లక్షల రూపాయ లతో అనకాపల్లి నుండి గుడిమడకరో డ్డు ప్రారంభించిన రాష్ట్ర మంత్రి గుడి వాడ అమర్నాథ్.ఆర్ అండ్ బి నుండి కోటి రూపాయలు జీవీఎంపీ 40 లక్షల రూపాయలతో ఈ రహదారిని నిర్మా ణం చేశారు.అలాగే అనకాపల్లి నుండి అచ్చుతాపురం వెళ్లే రహదారిని 230 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తు న్నామని మంత్రి గుడి వాడ తెలిపా రు.ఎంపీ సత్యవతమ్మ మాట్లాడుతూ త్వరలో కేంద్ర మంత్రి గట్కారి చేతుల మీదుగా అనకాపల్లి టు అనంతపురం రహదారిని ప్రారంభి స్తున్నట్లు తెలిపారు.

## నిరుద్యోగ దీక్ష గురించి తెలియదు

**నల్గొండ**

28న నల్గొండ నిరుద్యోగ దీక్ష గురించి పూర్తిగా నాకు తెలియదని ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. జూన్ మొదటి వారంలో భట్టి విక్రమార్క యాత్ర సందర్భంగా నల్గొండలో ప్రియాంక గాంధీ సభ పెట్టబోతున్నాం. సీఎం కెసిఆర్ ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ పెంచాలి. నల్గొండ దత్తత తీసుకున్న సీఎం కెసిఆర్ ముస్లింలు,దళితులు, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించాలి. నల్గొండ నుంచి నేను పోటీ చేయడం ఖాయం. తెలంగాణలో భారీ మెజారిటీతో గెలిపించాలి. ఇరవై ఏళ్ళు నిజాయితీగా పని చేసి అభివృద్ధి చేశా, ఆపదలో ఉన్న అందరికి సేవ చేశానని అయన అన్నారు.

## సోదర భావంతో మెలుగుతూ మతసామరస్యానికి పాటుపడాలి

**కోరుట్ల :**

హిందూ ముస్లింలు సోదర భావంతో మెలుగుతూ మతసామరస్యానికి ప్రతీకలుగా నిలవాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. పట్టణానికి చెందిన ఆదర్శ విద్యాలయం పూర్వ విద్యార్థులు తమ గురువు స్వర్గీయ అల్లె సంగయ్య స్మారకార్థం ఆదర్శ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, కోరుట్ల సిఐ ప్రవీణ్, కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముక్కెర చంద్రశేఖర్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనమంతా మతాలకతీతంగా మానవత్వంతో మెలగాలని అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మిట్టపెల్లి సాయి కృష్ణ, రాజేందర్, అవినాష్, శివ మధుకర్, సాయికిరణ్, రాకేష్, వెంకటేష్,నిరంజన్, నరేష్,

# కన్నా టార్గెట్ గా కమలం అడుగులు

**గుంటూరు :**



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల24న గుంటూరులో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర పార్టీ నాయకత్వం హాజరుకాబోతోంది. ఇప్పటికే రాష్ట్ర పార్టీ కోర్ కమిటి సమావేశాన్ని రాజమండ్రిలో నిర్వహించారు. ఇప్పుడు రాష్ట్ర పార్టీ కార్యవర్గ సమావేశానికి గుంటూరును వేదికగా ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యచరణ అంశాలతో పాటుగా, ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ విస్తరణ, జిల్లాల వారీగా కమిటిల నియామకంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ సమావేశానికి జాతీయ నాయకత్వం నుంచి నేతలు కూడా హాజరయ్యే అవకాశం ఉంది.

గుంటూరుకు చెందిన కీలక నేత కన్నా లక్ష్మినారాయణ పార్టీకి రాజీనామా చేసి తెలుగు దేశం పార్టీలో జాయిన్ అయ్యారు. దీంతో ఇప్పుడు భారతీయ జనతా పార్టీకి చెందిన నాయకులు గుంటూరులోనే సమావేశం కాబోతున్నారు. గుంటూరు కేంద్రంగా రాజకీయ వ్యూహాలు, పార్టీ విస్తరణ, జిల్లాలో నూతన నాయకులను పార్టీలోకి చేర్చుకునే విషయాలపై ప్రధానంగా చర్చించే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. కన్నా పార్టీని వీడిన తరువాత చాలా మంది నాయకులు పార్టీని వీడతారని భావించారు. అందుకు భిన్నంగా చాలా మంది నాయకులు భారతీయ జనతా పార్టీలోనే ఇంకా కంటిన్యూ అవుతున్నారు. అలాంటి వారందరికి భరోసా కల్పించటంటతో పాటుగా పార్టీని మరింతగా బలోపేతం చేసే విషయంలో ఎలా ముందుకు సాగాలి అనే విషయాలపై క్లారిటి ఇచ్చే అవకాశం ఉంది.భారతీయ జనతా పార్టీలోకి కీలక నేతలు, పారిశ్రామిక వేత్తలు వస్తున్నారని ప్రచారం నడుస్తోంది. తాజాగా గుంటూరుకు చెందిన తులసి సీడ్స్ అధినేత, పారిశ్రామికవేత్త తులసీ రామచంద్ర ప్రభు భారతీయ జనతా పార్టీకి దగ్గరయ్యారు. రాజమండ్రిలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి రాష్ట్ర పార్టీ ఇంచార్జ్ వి మురళీధరన్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు సమక్షంలో పార్టీలో చేరుతున్నారు. గుంటూరుకు చెందిన తులసీ సీడ్స్ అధినేత తులసీ రామచంద్ర ప్రభు 2009 ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రజా రాజ్యం పార్టీ నుంచి పోటీ చేశారు. కన్నా లక్ష్మి నారాయణపై పోటీ చేసి గట్టి పోటీ ఇచ్చారు. పారిశ్రామికంగా సేవారంగల్లో అత్యంత ప్రతిష్టాత్మక అవార్డులను పొందిన తులసి రామచంద్ర ప్రభు రానున్న ఎన్నికల్లో పార్టీ ఆదేశానుసారం పోటీ చేయడానికి కూడా సిద్ధమైనట్లు తెలుస్తోంది. గుంటూరు జిల్లా కేంద్రంగా కన్నా లక్ష్మినారాయణ కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా గతంలో భారతీయ జనతా పార్టీలో కీలకంగా వ్యవహరించారు. రాష్ట్ర భారతీయ జనతా పార్టీకి అధ్యక్షుడి హోదాలో పని చేసిన కన్నా ఆ తరువాత పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ ఇటీవలే తెలుగు దేశం పార్టీలో చేరారు. దీంతో కాపు సామాజికవర్గం నుంచి కన్నా లక్ష్మినారాయణ, స్థానంలో తులసి రామ చంద్ర ప్రభును ఆహ్వానిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో ఉన్న కన్నా లక్ష్మినారాయణ గుంటూరు పశ్చిమం నుంచి పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. దీంతో అదే స్థానంలో భారతీయ జనతా పార్టీ నుంచి తులసి రామ చంద్ర ప్రభు బరిలోకి దింపుతారని పార్టీలో చర్చ నడుస్తోంది

# అవినీతి, అక్రమాలకు అడ్డాగా డీఐసీ

**కాకినాడ :**

కాకినాడ కర్మాగార కార్యాలయం అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారింది. అధికారులకు కార్యాలయం సొంతిల్లైపోయింది. ఇష్టం వచ్చినట్లు పోస్టింగ్ లు వేయించుకుంటున్నారు. వారికి నచ్చినట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. లంచాలు మింగి సస్పెండైనా మళ్లీ అదే కార్యాలయంలో తిష్ట వేస్తున్నారు. దీనికిగాను లక్షలు పోసి పోస్టింగ్ లు కొనుగోలు చేస్తున్నారు. అసలు ఇక్కడ సిబ్బందికి విధులపట్ల బాధ్యతగానీ, నిబంధనల పట్ల గౌరవంగానీ, ప్రభుత్వమంటే భయంగానీ లేదు. దీనిపై అనేక ఫిర్యాదులు అందినా పట్టించుకునే నాథుడు లేకపోవడం గమనార్హం.కాకినాడ కర్మాగారాల శాఖ కార్యాలయలో సన్యాసిరావు అనే జూనియర్ అసిస్టెంటు చాలా కాలం నుంచి పని చేస్తున్నారు. ఆయన రూ.20 వేలు లంచం తీసుకొంటూ పట్టుబడ్డారు. దీంతో సన్యాసిరావును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కొద్ది కాలానికి సదరు అధికారి సస్పెండ్ అయిన కాకినాడలోనే అదే సీటులో పోస్టింగు వేయించుకున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా పోస్టింగు వేయడంతో అనేక మంది ముక్కున వేలేసుకున్నారు. ఇది ఎలా జరిగిందని ఆరా తీస్తే సన్యాసిరావు జాయింట్ డైరెక్టరుకు దగ్గర బంధువు అని తెలిసింది. ఇంకేముంది సదరు జాయింట్ డైరెక్టర్ పలుకుబడి ఉపయోగించుకుని ఎక్కడైతే బల్ల కింద చేతులు పెట్టాడో.. అక్కడే సన్యాసిరావు దర్జాగా పోస్టింగ్ లో కూర్చున్నారు.కార్యాలయంలో పార్వతి అనే టైపిస్టు పని చేస్తున్నారు. తండ్రి చనిపోతే కారుణ్య నియామకం కింద పార్వతికి అటెండరుగా పోస్టింగ్ ఇచ్చారు. అయితే ఈమె టైపిస్టుగా సేవలు అందిస్తున్నారు. ఏడాది కాలంలో తెలుగు టైపింగ్ లో ప్రావీణ్యం పొంది ధ్రువీకరణ పత్రం కూడా సంపాదించి టైపిస్టుగా కొనసాగాలని ఆదేశాలు ఇచ్చారు. నేటికి రెండో ఏడాది దగ్గర పడుతున్నా ఈమె తెలుగు టైపింగులో ప్రావీణ్యం పొందలేదు. ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించలేదు. దీంతో పార్వతి అనధికారికంగా టైపిస్టుగానే కొనసాగుతున్నారు.గోపాల్ అనే వ్యక్తి జూనియర్ అసిస్టెంటుగా సేవలు అందిస్తున్నారు. ఈయన 17 సంవత్సరాల నుంచి ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే పాతుకుపోయారు.అయితే ఇతనికి అంధత్వం 70 శాతం ఉందని సర్టిఫికెట్ సంపాదించారు. కానీ వాస్తవానికి ఇతనికి అంతగా అంధత్వం లేదు. అయితే 2019లో దొంగ ధ్రువీకరణ పత్రాలు వస్తున్నాయనే కారణంతో వికలాంగులకు సదరమ్ ద్వారా సర్టిఫికెట్లు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే గోపాల్ మాత్రం సదరమ్ లో ధ్రువీకరణ పత్రం పొందకుండా తప్పించుకొని తిరుగు తున్నారు. కాకినాడలో ఉన్న పరిశ్రమల శాఖలో అవినీతి మీద ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాను. కానీ ఫలితం లేదు. కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను. ఇకనైనా ఉన్నాధికారి ఆజాద్ జవహర్ లాల్ స్పందించి సమగ్రమైన విచారణ చేసి అవినీతి అధికారుల భరతం పట్టాలని కోరుతున్నానని తెలిపారు

# విజయసాయిరెడ్డి కనిపించడం లేదే

**విజయవాడ :**

వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి జగన్ తర్వాత రెండో స్థానం అనుకున్నారు. ఇప్పుడు క్రమంగా పార్టీకి దూరంగా జరుగుతున్నట్లే కనిపిస్తుంది. గతకొద్ది రోజులుగా విజయసాయిరెడ్డి మౌనంగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. ఏదో జరిగింది. జగన్‌కు, విజయసాయిరెడ్డిల మధ్య విభేదాలు పొడసూపాయన్న ప్రచారాన్ని నిజం చేస్తూ సాయిరెడ్డి వ్యవహారశైలి కూడా కొనసాగుతుంది. ఇటీవలే విజయసాయిరెడ్డి రాజ్యసభ పదవి రెన్యువల్ అయింది. తర్వాత క్రమంగా పార్టీ హైకమాండ్ ఆయనను దూరం పెడుతుందనిపిస్తుంది.విశాఖ నుంచి మంగళగిరికి తొలి మూడున్నరేళ్లు విజయసాయిరెడ్డి విశాఖ కేంద్రంగా పార్టీలో కొంత హల్‌చల్ చేశారు. అక్కడే ఒక ఫ్లాట్ కొనుక్కుని పార్టీ బలోపేతం కోసం పనిచేశారు. అయితే ఏం జరిగిందో ఏమో.. ఉన్నట్లుండి విజయసాయిరెడ్డి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి పదవి నుంచి జగన్ తప్పించారు. ఆయన స్థానంలో వైవీ సుబ్బారెడ్డిని నియమించారు. ఆయనను పార్టీ అనుబంధ సంఘాల బాధ్యతను చూసుకోవాలని జగన్ ఆదేశించినట్లు వార్తలొచ్చాయి. కొంతకాలానికి అది కూడా పీకేశారు. దీంతో విజయసాయిరెడ్డి ఢిల్లీ, హైదరాబాద్‌కే పరిమితయ్యారు. ఎక్కడా పార్టీలో యాక్టివ్ గా కనిపించడం లేదు. జగన్‌కు, విజయసాయిరెడ్డికి మధ్య గ్యాప్ వచ్చిందనడానికి విజయసాయిరెడ్డి యాక్టివ్ నెస్ ఒక ఉదాహరణంగా చెప్పాలి. అంతా బాగుంటే విజయ సాయిరెడ్డి ఊరుకునే రకం కాదు. ప్రధానంగా చంద్రబాబును, లోకేష్ ను ఉతికి ఆరేస్తుంటారు. అలాంటిది వారిపై ఎలాంటి కామెంట్స్ చేయడం లేదు. అలాగే ఏ2 అంటూ చంద్రబాబు ప్రతి ప్రసంగంలో విజయసాయిరెడ్డికి చోటు కల్పించేవారు. కానీ కొన్నాళ్ల నుంచి చంద్రబాబు కూడా విజయసాయిరెడ్డి పేరు ఎత్తకుండా జగన్‌పై మాత్రమే విమర్శలు చేస్తుండటం కూడా క్యాడర్‌లో అనేక సందేహాలు కలుగుతున్నాయి. ఇటీవల వైసీపీ సోషల్ మీడియా కూడా విజయ సాయిరెడ్డిపై విమర్శలు చేస్తుండటం చూస్తే బాగానే చెడిందని అనుకోవాల్సి ఉంటుంది. ఎక్కడా సాయిరెడ్డి కన్పిం చడమే మానేశారు. అంత యాక్టివ్‌గా ఉండే ఆయన దూరమవ్వడానికి కారణాలు మాత్రం తెలియరాలేదు. టీడీపీ అనుకూల మీడియాలోనూ సాయిరెడ్డికి వ్యతిరేకంగా వార్తలు రావడం లేదు.తారకరత్న మరణం తర్వాత చంద్రబాబుతో కలసి విజయ సాయిరెడ్డి మీడియాతో మాట్లాడటం వంటి విషయాలు జగన్‌కు ఆగ్రహం



తెప్పించాయని కొందరంటారు. కానీ అది ఫ్యామిలీలో జరిగిన విషాద ఘటన కాబట్టి జగన్ కూడా దానిని సీరియస్‌గా తీసుకుంటారని భావించలేం. కానీ అంతకు మించింది ఏందో జరిగింది. అదే బయటకు రావడం లేదు. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే విజయ సాయిరెడ్డిని పార్టీ దూరం పెట్టిందా? లేదా ఆయనే దూరం జరిగారా? అన్నది తెలియకపోయినా ఒకటి మాత్రం నిజం. పెద్ద గ్యాప్ ఉందన్నది వాస్తవం. ఎన్నికలు దగ్గరపడు తున్నాయని జగన్ విజయసాయిరెడ్డిని దూరం పెట్టారా? లేక సాయిరెడ్డి వల్ల పార్టీ నష్టం జరుగుతుందని భావించి గ్యాప్ ను తానే చేసుకున్నారా? అన్నది మాత్రం బయటకు రావడం లేదు. మొత్తం మీద ఇద్దరి మధ్య గ్యాప్ ఎక్కువగానే ఉందన్నది మాత్రం జరుగుతున్న పరిణామలను బట్టి చెబుతుంది.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

**హైదరాబాద్**



మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా సనత్ నగర్ లోని వెల్ఫేర్ సెంటర్ గ్రౌండ్ లో వేలాది మంది ముస్లీం సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్ధనలలో మంత్రి పాల్గొన్నారు. ప్రార్ధనల అనంతరం ముస్లీం సోదరులను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ సందర్భంగా నెల రోజుల పాటు ఎంతో నిష్ఠతో ఉపవాస దీక్షలు చేస్తారని తెలిపారు. రంజాన్ ను ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ డివిజన్ పార్టీ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు సరాఫ్

## అప్పన్న నిజ రూప దర్శనానికి సర్వం సిద్ధం

**విశాఖపట్నం**

విశాఖ సింహాద్రి అప్పన్న స్వామి నిజరూప దర్శనాన్ని కనులారా తిలకించే సమయం ఆసన్నమైంది. త్రిభంగి రూపంలోని వరాహ నరహరిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఎదురు చూస్తున్నారు.రేపు తెల్లవారుజాము నుంచే భారీగా తరలి వచ్చే భక్తుల కోసం అధికారులు ప్రత్యే క ఏర్పాట్లు పూర్తి చేశారు.ఆలయ అనువంశిక ధర్మకర్తకు వేకువజామున తొలి దర్శనం అనంతరం ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి, అలాగే టిటిడి తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తారు. నాలుగు గంటల నుంచి భక్తులకు సర్వ దర్శనాలు ప్రారంభమ వుతాయి.దాదాపు ఆరు వేల మంది ప్రొటోకాల్ ప్రముఖులకు అంతరాలయ దర్శనం కల్పించనున్నట్లు కలెక్టర్ మల్లి కార్జున తెలిపారు.గత ఏడాది ఐదు వేల మందికి అంతరాలయం దర్శనం కల్పించామన్నారు.టికెట్లపై ముద్రించి న సమయాల్లోనే దర్శనాలకు రావాల న్నారు.

## కళకళలాడుతున్న మసీదులు

**విశాఖపట్నం**

ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్ష లో పాల్గొన్న ముస్లింలు రంజాన్ పండు గను పురస్కరించుకుని ఈద్గా స్థలం వద్ద ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ఆచరిం చారు.విశాఖలో పలు మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.ముస్లిం మత గురువులు తక్రిర్ పాటించారు. ఖురాన్ లో సూక్తులు వివరించారు. అనంతరం ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ను ఆచరించి న ముస్లిం సోదరులు ఒకరికొకరు అలింగనం చేసుకుంటూ ఈద్ శుభా కాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు సాంప్రదాయ వస్త్రాలతో అలరించారు.

## అది మనకు అవసరమా తమ్ముళ్లు?...

**హైదరాబాద్ :**

టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్మధ్య మాటల యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. మునుగోడు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కేసీఆర్ రూ.25కోట్లు ఇచ్చారని ఈటల ఆరోపించగా.. ఈటల వ్యాఖ్యలపై రేవంత్ సవాల్ విసిరారు. బీజేపీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు అబద్ధమని.. దీనిపై భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద తడిబట్టలతో ప్రమాణానికి సిద్ధమని టీపీసీసీ చీఫ్ సవాల్ విసిరారు. ఇదిలా ఉండగా... రేవంత్, ఈటల మధ్య జరుగుతున్న వార్‌పై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఇద్దరు నేతలకు చురకలంటించారు.నిరంతర తెలంగాణ ఉద్యమకారిణిగా ప్రజల అభిప్రాయం చెప్పడం ఈ సందర్భంలో తన బాధ్యతన్నారు. బీఆర్ఎస్‌తో పోరాడే తమ్ముళ్లు రేవంత్, ఈటల తమ దాడిని ఒకరిపై ఒకరు చేసుకోవడం సరికాదని తెలిపారు. ఎవరి ధోరణిలో వారు ప్రభుత్వంపై పోరాడటం అవసరమేమో అనిపిస్తుందని సూచించారు. ఈ సందర్భంలో కొంచెం ఆలోచించాలని తెలంగాణ ప్రస్తుత పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉన్న ఇద్దరికీ చెప్పడం తన బాధ్యత అని చెప్పుకొచ్చారు. దేశంలోనే అత్యంత ధన ప్రభావిత ఎన్నికల కార్యాచరణ తెలంగాణలో కొనసాగుతోందన్నారు. తెలంగాణ రాజకీయ కార్యకర్తలందరూ గత తొమ్మిది సంవత్సరాలుగా చూస్తున్న వాస్తవమిదని తెలిపారు. ఇందుకు కారణంగా ఉన్న అసలైన దుర్మార్గ వ్యవస్థపై పోరాడాల్సిన కర్తవ్యం మనకు తప్పనిసరిగా ఉన్నదనేది నిజమని చెప్పారు. ఈ విధానాన్ని అధికారపార్టీ ప్రజాస్వామ్య హనన రాజకీయ దుష్కృత్య ధోరణులపై కాక, ప్రతిపక్షాల నేతలు పరస్పరం చేసుకునే మాటల, సవాళ్ల దాడులు, బీఆర్ఎస్‌కు వేడుకలు అవుతున్నాయని విజయశాంతి పేర్కొన్నారు.

## ఫ్రైడే అండ్ డ్రైవ్ కార్యక్రమం తనిఖీ

**నంద్యాల**

నంద్యాల జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామంలో అయ్యలూరు గ్రామంలో జరుగుతున్నటువంటి ఫ్రైడే మరియు డ్రై డే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు మరియు సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికి సందర్శించి పరిసరాలలో నీటి నిలువ ఉన్నటువంటి డ్రమ్ములలో, తొట్లలోనూ, వారానికి ఒక రోజు ఖాళీ చేసి ఎండలో ఒక గంట సేపు ఆరబెట్టినచో ప్రజలకు అవగాహన కలిగించారు

ప్రజా తపన
prajathapana.com

# ఆస్కార్ టీమ్ కు షా విందు

**హైదరాబాద్ :**

నాటు నాటు పాటకు ఆస్కార్ గెలుచుకున్న ట్రిపుల్ ఆర్ సినిమా టీంకు అమిత్ షా విందు ఇవ్వనున్నారు. తెలంగాణ పర్యటనకు వస్తున్న అమిత్ షా.. హైదరాబాద్‌లోనే ఈ విందు ఇవ్వనున్నారు. .ఈ విందు భేటీ దాదాపుగా 40 నిమిషాల సేపు ఉంటుంది. ఆస్కార్ గెలిచినందుకు అమిత్ షా ఆత్మీయ సన్మానం చేయనున్నట్లుగా తెలుస్తోంద. ట్రిపుల్ ఆర్ దర్శకుడు, హీరోలతోపాటు కీలకమైన యూనిట్ మొత్తాన్ని ఆహ్వానించినట్లుగా చెబుతున్నారు. దేశానికి గర్వకారణం అయిన విజయం సాధించినందుకు గుర్తుగా ఈ విందు ఏర్పాటు చేస్తున్నట్లుగా బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో ఎలాంటి రాజకీయం లేదని చెబుతున్నారు.నిజానికి ఆర్ ఆర్ ఆర్ టీం ఆస్కార్ అవార్డుల తర్వాత విడివిడిగా ఇండియాకు చేరుకున్నారు. చిరంజీవి, రామ్ చరణ్ ఇండియాకు వచ్చిన తర్వాత అమిత్ షాను కలిశారు. అలాగే సినిమా ఇంకా ఆస్కార్ విజయం సాధించకముందు హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు అమిత్ షా.. జూనియర్ ఎన్టీఆర్ ను హోటల్‌కు పిలిపించుకుని అభినందించారు. అయితే ఇప్పుడు అధికారికంగా టీం మొత్తానికి సన్మానం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఆస్కార్ అవార్డు సాధించినప్పటి నుండి రాజమౌళి టీంకు వరుసగా సన్మానాలు జరుగుతూనే ఉన్నాయి. టాలీవుడ్ మొత్తం హైదరాబాద్ శిల్పకళావేదికలో తెలుగు చిత్రపరిశ్రమ ఘనంగా సత్కరించింది. తెలుగు సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరికీ ఈ సన్మాన కార్యక్రమం ఓ మంచి జ్ఞాపకం, గర్వించదగ్గ ప్రోత్సాహం అయిందని అందరూ సంతోషం వ్యక్తం చేశారు. అలాగే వివిధ నగరాల్లో విదేశాల్లో కూడా సన్మాన కార్యక్రమాలు జరిగాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా త్వరలో సన్మాన సభను ఏర్పాటు చేయనుంది. ఆస్కార్ అవార్డ్ ను అందుకున్న ఏకైక తెలుగు చలనచిత్రం ఆర్ ఆర్ఆర్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీ లో నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడం పట్ల తెలుగు రాష్ట్రాలు, దేశం గర్వపడుతుందని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఆర్ఆర్ఆర్ సినిమా ప్రపంచవ్యాప్తంగా విజయం సాధించింది. బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు సాధించింది. భారత సినీ చరిత్రలో అతి భారీ విజయాన్ని నమోదు చేసింది. జపాన్ వంటి దేశాల్లోనూ మంచి వసూళ్లు రాబట్టింది. నాటు నాటు పాటు పిల్లలకు కూడా నోటెడ్ అయిపోయింది. ఇంత భారీ విజయం సాధించిన సినిమాకు.. ఆస్కార్ కూడా రావడంతో తిరుగులేకుండా అయినట్లయింది. ఆ సినిమా టీంను గౌరవించుకునేందుకు ప్రభుత్వాలు కూడా పోటీ పడుతున్నాయి.

**చేరికలపై షా... ఆరా**

ఇదే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతోంది తెలంగాణ. ఇప్పటికే ప్రధాన పార్టీలు నువ్వా -నేనా అన్నట్లు ముందుకెళ్తున్నాయి. అధికార బీఆర్ఎస్ మరోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తుంటే... ఇప్పటికే రెండుసార్లు అధికారానికి దూరమైన తెలంగాణ కాంగ్రెస్...ఈసారి ఎలాగైనా గెలిచాలని చూస్తోంది. ఇదిలా ఉంటే బీజేపీ మాత్రం... తెలంగాణపై సీరియస్ గా ఫోకస్ పెట్టేసింది. గత కొంతకాలంగా ఆ పార్టీ బలపడుతూ వస్తోంది. కీలమైన ఉపఎన్నికలతో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటిన కమలనాథులు... రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ జెండాను ఎగరవేయాలని చూస్తున్నారు. ఈ క్రమంలో అగ్రనేతలు కూడా వరుసగా రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. ఇటివలే ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే? కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కూడా తెలంగాణ పర్యటనకు రానున్నారు. పర్యటనలో భాగంగా చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర నాయకత్వం ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. ఈ బహిరంగ సభ నుంచే అమిత్ షా ఎన్నికలకు సమర శంఖారావం పూరించనున్నట్లు తెలుస్తోంది. గత కొద్దిరోజుల కిందట రాష్ట్రానికి వచ్చిన అమిత్ షా? ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇదే సమయంలో పార్టీ నేతలతో కూడా మంతనాలు జరిపారు. అయితే ఈసారి మాత్రం ప్రత్యేకంగా పార్టీ ఏర్పాటు చేయనున్న భారీ సభకు హాజరుకానున్న నేపథ్యంలో అమిత్ షా ప్రసంగంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 90 స్థానాల్లో గెలుపు లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతుంది.ఇప్పట్నుంచే ప్రజల్లో ఉంటూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతంపై చూసే అంశాలపై ప్రధానంగా దృష్టి సారించింది. ఆయా నియోజకవర్గాల స్థానాల్లో బలమైన అభ్యర్థుల కోసం బీజేపీ హైకమాండ్ ఫోకస్ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే పార్టీ బలహీనంగా ఉన్న స్థానాల్లో చేపట్టాల్సిన చర్యలపై కూడా లోతుగానే చర్చిస్తోంది. ఈ సీట్లలో బలమైన అభ్యర్థులను తెరపైకి తీసుకురావటంతో పాటు పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యాచరణపై కూడా కసరత్తు చేస్తోంది. ఇక చేవెళ్ల సభ వేదికగా భారీగా చేరికలు ఉంటాయన్న లీకులు కూడా వస్తున్నాయి. బీఆర్ఎస్ కు చెందిన పలువురు కీలక నేతలు కమలం కండువా కప్పుకొనే ఛాన్స్ ఉందన్న చర్చ జోరుగా వినిపిస్తోంది. అయితే దీనిపై బీజేపీ నేతల నుంచి క్లారిటీ లేదు. ఫలితంగా చేరికల విషయంపై ఉత్కంఠ నెలకొందనే చెప్పొచ్చు. మొత్తంగా మరికొద్ది నెలల్లోనే ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో....బీజేపీ మరింత దూకుడు పెంచే అవకాశం ఉంది.

# విక్రయానికి సర్కారీ స్క్రాప్

**ఖమ్మం:**

వైరా మున్సిపాలిటీ కార్యాలయంలో భద్రపరిచిన స్క్రాప్ ఇనుము, స్వచ్ఛ రిక్షాలు మాయం చేసిన ఇంటి దొంగలపై నెలలు గడుస్తున్నప్పటికీ కనీస చర్యలు కరువయ్యాయి. మున్సిపాలిటీ కార్యాలయంలో భద్రపరిచిన స్క్రాప్ ఇనుము, రిక్షాలు మాయమైనట్లు రెండు నెలల క్రితమే వెలుగు చూసినప్పటికీ కనీసం వాటి గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ స్క్రాప్ మున్సిపాలిటీ అధికారుల సహకారంతోనే మాయమైనప్పటికీ మున్సిపాలిటీ ఉన్నతాధికారులు, జిల్లా ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారితిస్తుంది. ఉన్నతాధికారులు స్క్రాప్ మాయంపై చేతులెత్తేసారా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.వైరా మున్సిపాలిటీలో జరిగే అవినీతి అక్రమాలకు ప్రభుత్వ నిబంధనలు వర్తించవా అంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సొత్తును దర్జాగా వైరా మున్సిపాలిటీలో దోచుకున్నప్పటికీ ఇదంతా "మామూలే" అని అధికారులు వదిలేస్తున్నారు. వైరాలో వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం మున్సిపాలిటీ ఆఫీస్ సమీపంలో మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ తాత్కాలిక క్యాంప్ ఆఫీస్‌తో పాటు, ఆ పక్కనే ఉన్న మరో గోదామును కూల్చి వేశారు. ఈ గోదాములు సంబంధించిన స్క్రాప్ ఇనుముతో పాటు ఇతర సామాగ్రిని వైరా మున్సిపాలిటీ కార్యాలయంలో భద్రపరిచారు. అదేవిధంగా వైరా రిజర్వాయర్ వద్ద ఉన్న పట్టు పరిశ్రమ భవనాన్ని గతంలో కూల్చివేశారు.ఈ భవనానికి సంబంధించిన స్క్రాప్ ఇనుము తో పాటు ఇతర సామాగ్రి కనిపించడం లేదు గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు 20 స్వచ్ఛ రిక్షాలను ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల రిక్షాలు వైరా మున్సిపాలిటీకి అప్పగించారు. అయితే ఈ స్వచ్ఛ రిక్షాలు మాయమయ్యాయి. టన్నుల కొద్దీ ఇనుముతో పాటు రిక్షాలు కనిపించకపోయినా కనీసం పట్టించుకునే వారే కరువయ్యారు. గత ఏడాది అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన కమిషనర్ హయాంలోనే ఈ గోల్ మాల్ జరిగిన విషయం వైరా మున్సిపాలిటీలోని ప్రజలందరికీ తెలిసిందే.అయితే ఈ సంఘటన సంబంధించి నేటి వరకు అధికారులు పోలీసులు కూడా ఫిర్యాదు చేయలేదు. లక్షలాది రూపాయల స్క్రాప్‌ను మాయం చేసిన వారిని గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారు. ఈ స్క్రాప్‌ను పాత ఇనుము దుకాణంలో విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి స్క్రాప్‌ను మాయం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వైరా మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

# ఆవిర్భావసభకు భారీ ఏర్పాట్లు

**హైదరాబాద్ :**

భారత్ రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణ భవన్‌లో ఈ నెల 27న నిర్వహించేందుకు పార్టీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పరిమిత సంఖ్యలోనే పార్టీ ప్రతినిధులను ఈ వేడుకకు ఆహ్వానించనుంది. బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగే పార్టీ జనరల్ బాడీ సమావేశంలో 300 మంది (మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ కార్పొరేషన్లు, జెడ్పీ, మున్సిపల్ కార్పొరేషన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, పార్టీ కార్యవర్గం, అనుబంధ సంఘాల అధ్యక్షులు) నేతలు పాల్గననున్నారు.గతంలో జరిగిన జనరల్ బాడీ సమావేశానికి పార్టీ ప్రతినిధులను మౌఖికంగా ఆహ్వానించగా ఆవిర్భావ దినోత్సవానికి మాత్రం వ్యక్తిగతంగా అటు పార్టీ, ఇటు శాసనసభాపక్షం, పార్లమెంటరీ పార్టీ నుంచి ఆహ్వానపత్రాలు పంపుతున్నారు. ఎల్బీ స్టేడియంలో సుమారు 6 వేల మంది ప్రతినిధులతో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలని తొలుత భావించినా వరికోతలు ముమ్మరంగా సాగుతుండటం, వేసవి తీవ్రత పెరగడంతో పార్టీ జనరల్ బాడీ సమావేశాన్ని మాత్రమే నిర్వహించాలని నిర్ణయించారు. బీఆర్ఎస్‌గా మారాక జరుగుతున్న తొలి ఆవిర్భావ దినోత్సవం కావడంతో ఏప్రిల్ 27న తెలంగాణ భవన్‌లో జరిగే జనరల్ బాడీ సమావేశంలో ఐదు రాజకీయ తీర్మానాలు ఉంటాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి. జాతీయ, తెలంగాణలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై బీఆర్ఎస్ వైఖరిని వెల్లడించేందుకు వీలుగా ఐదు రాజకీయ తీర్మానాలు రూపుదిద్దుకుంటున్నట్లు సమాచారం. జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ పాత్ర, భావసారూప్య పార్టీలతో కలసి పనిచేయడం, కేంద్రంలోని అధికార బీజేపీ విధానాలను ఎండగట్టడం, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్ర రాజకీయా ల్లో బీఆర్ఎస్ పాత్ర తదితర అంశాలు ఈ రాజకీయ తీర్మానాల్లో ఉండనున్నాయి. పార్టీ ఆత్మీ□య సమ్మేళనాల తీరుతెన్నులపై ఎమ్మెల్సీ మధు□సూదనాచారి నేతృత్వంలోని కమిటీ ఎప్పటికప్పుడు పార్టీ అధినేతకు నివేదికలు అందిస్తోంది. ఆవిర్భావ దినోత్సవంలో ఆత్మీయ సమ్మేళనాల తీరుతెన్నులను విశ్లేషించడంతోపాటు యువజన, విద్యార్థి సమ్మేళనాల నిర్వహణపై దిశానిర్దేశం చేసే అవకాశముంది. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో కేడర్‌తోపాటు యువజన, విద్యార్థి వివిధ సామాజిక వర్గాలతో భేటీకి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. అక్టోబర్ 10న వరంగల్‌లో పార్టీ మహాసభను నిర్వహించడంతోపాటు ఆ తర్వాత వరుసగా బహిరంగ సభల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలతోపాటు రాబోయే పార్లమెంటు ఎన్నికల సన్నద్ధతకు సంబంధించి 27న జరిగే ఆవిర్భావ సభలో దిశానిర్దేశం చేసే అవకాశముంది.

# ఇక నాలుగేళ్ల డిగ్రీ...

**హైదరాబాద్ :**

తెలంగాణలో ఇకపై డిగ్రీలో కొత్తగా వచ్చే కోర్సులన్నీ నాలుగేళ్ల కాలపరిమితితో (ఆనర్స్ డిగ్రీ కోర్సులు) ఉండబోతున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచే దీన్ని దశల వారీగా అమలు చేయబోతున్నట్లు ఉన్నత విద్యామండలి కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే విద్యాసంవత్సరం(2023-24) నుంచి మూడేళ్ల వ్యవధితో కంప్యూటర్ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కోర్సును ప్రవేశపెట్టాలని ఇటీవల నిర్ణయించగా తాజాగా దాన్ని నాలుగేళ్లకు పెంచనున్నారు. ఈ కోర్సుల్లో కంప్యూటర్ సైన్స్‌ను ఒక సబ్జెక్టుగా కాకుండా పూర్తిస్థాయిలో బోధించేలా సిలబస్‌కు రూపకల్పన చేస్తున్నారు. కృత్రిమమేధ, సైబర్‌సెక్యూరిటీ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ తదితర అంశాలను ఇందులో బోధిస్తారు. జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా ఉన్నత విద్యలో ఈ మేరకు మార్పులు చేయనున్నారు. సాధారణ డిగ్రీ కోర్సుల స్థానంలో ఆనర్స్ కోర్సులను ప్రవేశపెట్టాల్సిన అవసరాన్ని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అన్ని రాష్ట్రాలకు తెలిపింది. దీనిపై ఇటీవల యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్ కుమార్ పలు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి సాధ్యాసాధ్యాలపై నివేదికను కోరినట్టు అధికార వర్గాలు తెలిపాయి.యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్ ఇటీవల విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి తదితరులతో ఆన్‌లైన్ సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా నాలుగేళ్ల డిగ్రీ కోర్సులపై చర్చ జరిగింది. నాలుగేళ్లపాటు కోర్సుల్లో విద్యార్థులు నిలవడం కష్టమని, అర్హులైన అధ్యాపకుల కొరత కూడా ఉందన్న అభిప్రాయాన్ని రాష్ట్ర అధికారులు వ్యక్తం చేశారు. అందుకే కొత్తగా ప్రవేశపెట్టనున్న బీఎస్సీ ఆనర్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్‌ను మూడేళ్ల కోర్సుగా నిర్ణయించామని తెలిపారు. దాన్ని నాలుగేళ్లకు పెంచడానికి వీలవుతుందని అభిప్రాయపడ్డారు. ఇకపై ప్రవేశపెట్టే కోర్సులను మాత్రం నాలుగేళ్ల వ్యవధితో తీసుకొచ్చే ఆలోచన చేస్తామని యూజీసీ ఛైర్మన్‌కు చెప్పారు. ఒకవేళ మూడేళ్లకే వెళ్లిపోతామని విద్యార్థులు అనుకుంటే జాతీయ నూతన విద్యావిధానం ప్రకారం ఎగ్జిట్ ఆప్షన్ ఉన్నందున వారికి సాధారణ డిగ్రీ, నాలుగేళ్లు చదివేవారికి ఆనర్స్ డిగ్రీ ఇవ్వొచ్చని సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చారు.కంప్యూటర్ సైన్స్ ఆనర్స్ కోర్సును రాష్ట్రంలోని 10కిపైగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశపెడతారు. ప్రైవేట్ కళాశాలలకు కూడా అనుమతిస్తారు. ఈమేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనుంది. దీనిపై ఛైర్మన్ లింబాద్రి మాట్లాడుతూ డిగ్రీలో ఏటా 2.50 లక్షల మంది చేరుతున్నందున వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగేళ్ల కోర్సు వల్ల నేరుగా పీహెచ్‌డీలో చేరొచ్చని, విదేశీవిద్యకు వెళ్లేందుకు కూడా 16 సంవత్సరాల చదువు అవసరమైనందున ఆ ఇబ్బంది కూడా ఉండదన్నారు.ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో.. బీటెక్ తరహాలోనే సైన్స్‌లో కూడా నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు. ఆ కోర్సును రెండేళ్లు ఇక్కడ.. మరో రెండేళ్లు ఆస్ట్రేలియాలో పూర్తిచేసేలా అవకాశం కల్పించాలని యోచిస్తున్నారు. అలాగే బ్రిటన్, అమెరికా విశ్వవిద్యాలయాలతో కూడా ఇలాంటి ట్విన్నింగ్ కోర్సులను ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు.దేశవ్యాప్తంగా 142 విద్యాసంస్థల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్టు (సీయూఈటీ-పీజీ) తేదీలు ఖరారయ్యాయి. జూన్ 5 నుంచి 12వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్టు యూజీసీ ఛైర్మన్ మామిడాల జగదీశ్కుమార్ వెల్లడించారు. తదుపరి అప్‌డేట్‌ల కోసం అభ్యర్థులు ఎప్పటికప్పుడు ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ఆయన సూచించారు. సీయూఈటీ పీజీ దరఖాస్తుల గడువు ఏప్రిల్ 19తో ముగియడంతో ఆ గడువును మే 5 వరకు పొడిగించిన విషయం తెలిసిందే. పీజీల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు మే 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని ఎన్‌టీఏ ఓ ప్రకటనలో తెలిపింది.

# ఏడాది పొడవునా తెలంగాణ అమర్ నాథ్ దర్శనం

**మహబూబ్ నగర్ :**

నల్లమల సలేశ్వరం... తెలంగాణ అమర్‌నాథ్ యాత్రగా పేరొందిన సంగతి తెలిసిందే. ప్రతి ఏడాది చైత్ర పౌర్ణమి సందర్భంగా 3 రోజుల పాటు ఆదివాసీలు ఘనంగా ఈ జాతర నిర్వహిస్తారు. ఇందుకోసం తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తుంటారు. ఈసారి జరిగిన యాత్రకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావటంతో విషాదం కూడా నెలకొంది. మొత్తం ముగ్గురు భక్తులు ప్రాణాలు విడిచారు. అయితే పరిస్థితులను అంచనా వేసిన అటవీ శాఖ అధికారులు.... కీలక నిర్ణయం తీసుకున్నారు.సలేశ్వరం లింగమయ్య యాత్రను ఇకపై నిత్యం భక్తులకు అందుబాటులో ఉంచేందుకు సిద్ధమైంది అటవీ శాఖ. ఓవైపు పర్యావరణానికి మరోవైపు వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ప్యాకేజీని రూపొందించింది. ఈ ప్రత్యేక పర్యాటక ప్యాకేజీని ఉన్నతాధికారులు అనుమతిస్తే సుమారు నెలల తరబడి భక్తులు నల్లమలలో సాహస యాత్ర చేపట్టేందుకు అవకాశం దక్కనుంది. ఫలితంగా ఆదాయం కూడా రాబట్టేలా ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే సలేశ్వరం లింగమయ్య దర్శనానికి టూరిజం ప్యాకేజ్ ద్వారా అవకాశం కల్పించడంపై కార్యాచరణను సిద్ధం చేస్తోంది.సలేశ్వరం నాగర్ కర్నూల్ జిల్లా నల్లమల అడవులలో ఉంటుంది. శ్రీశైలం ? హైదరాబాద్ రహదారిలో అడవిలోకి వెళ్లాలి. మెయిన్ రోడ్డు నుంచి.. సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సుమారు 30 కిలోమీటర్ల దగ్గర వరకూ వెళ్లొచ్చు. మిగిలిన 5 కిలో మీటర్లు నడవాలి. రాళ్లు, రప్పలు ఉంటాయి. అయితే పది కిలోమీటర్ల దూరం వెళ్లగానే రోడ్డు పక్కన నిజాం కాలం నాటి ఒక పురాతన కట్టడం కనిపిస్తుంది. భక్తులు వచ్చేటప్పుడు.. వస్తున్నాం.. వస్తున్నాం.. లింగమయ్యో అంటూ వస్తారు. వెళ్లేటప్పుడు పోతున్నం.. పోతున్నం లింగమయ్యో అని భజన చేస్తూ వెళ్తారు. సలేశ్వరం లోయ దాదాపు రెండు కిలో మీటర్ల పొడవు ఉంటుంది. ప్రకృతిలో గడపాలని అనుకునే వారికి ఈ ప్రదేశం చాలా నచ్చుతుంది. సలేశ్వరం వెళ్లే దారిలో చెంచు గుడారాలు దాటుకుంటూ వెళ్లాలి.సలేశ్వరంలో శివుడు లింగ రూపంలో లోయలో దర్శనమిస్తాడు. ఈ ప్రదేశానికి ఏడాదిలో 3 రోజులు మాత్రమే అనుమతి ఉంటుంది. మిగిలిన రోజుల్లో.. అనుమతి ఇవ్వరు. జంతువులు తిరుగుతూ ఉంటాయి. ఇక్కడ జలపాతం చూసేందుకు ఎంతో అందంగా ఉంటుంది. సలేశ్వరం ఆలయాన్ని దర్శించుకునేందుకు.. మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నలుమూలల నుంచి భక్తులు వస్తారు. ఈ పురాతన దేవాలయం గురించి పురాణాల్లో కూడా ఉందట. గుడి శంఖు ఆకారంలో కనిపిస్తుంది. పరమ శివుడికి అంకితం చేసిన ఈ గుడిని ఆరు లేదా ఏడో శతాబ్దంలో కట్టినట్టుగా చెబుతారు. నల్లమల అడవుల్లోని చెంచులు సలేశ్వరుడిని కులదైవంగా భావిస్తారు. ఇప్ప పువ్వు, తేనె నైవేద్యంగా సమర్పిస్తారు. ఇక్కడ పూజలు సైతం వీళ్లే నిర్వహిస్తారు. తాజా నిర్ణయం అమల్లోకి వస్తే?. ఏడాది పొడవునా సలేశ్వరం యాత్రకు వెళ్లొచ్చు?!

# మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి ప్రేవేటుపరం చేయొద్దు

**హైదరాబాద్ :**



మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి ప్రేవేటుపరం చేయొద్దని కేంద్రరక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు మంత్రి హరీష్ రావు లేఖ రాశారు. దేశ రక్షణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న మెదక్ సహా ఇతర ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ప్రైవేటుపరం చేయొద్దన్నారు. దేశ భద్రత, 74 వేల మంది ఉద్యోగులను దృష్టిలో ఉంచుకొని వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. డిఫెన్స్ రంగంలో ఉన్న ఏడు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా ఆయా సంస్థల మధ్య పోటీ నెలకొంటుందని తెలిపారు. దీంతో నూతన ఆయుధాల అభివృద్ధి నిలిచిపోతుందని, ఇది మేకిన్ ఇండియా స్ఫూర్తిని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.మెదక్‌లోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి, సిబ్బందికి గత ఆర్థిక సంవత్సరంలో కావాల్సినంత పని ఉండేదని,దాదాపు రూ.930 కోట్ల ఆర్డర్లను సమయానికి పూర్తి చేశారని చెప్పుకొచ్చారు. సంస్థ సిబ్బంది ఎలాంటి సవాళ్లనైనా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థకు పెద్దగా పని అప్పగించలేదని.. దీనిని సాకుగా చూపి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని "సిక్ ఇండస్ట్రీ"గా ప్రకటిస్తారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా సుమారు 25వేల మంది భవిష్యత్తు అంధకారంలో పడుతుందని తెలిపారు. అలాగే ఆయుధ కర్మాగార తెలంగాణ ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధులు ఇచ్చిన ఆరు డిమాండ్లను లేఖకు జత చేశారు.

**ఆరు డిమాండ్లు ఇవే...**

1. మూడు రైతు చట్టాల మాదిరిగానే డిఫెన్స్ రంగా సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
2. పరిశోధనల విభాగాన్ని మరింత పటిష్టం చేయాలి.
3. మిషనరీని ఆధునికరించాలి. ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలి.
4. పరిపాలన, కొనుగోలు విధానాలను సరళీకరించాలి.
5. ఆర్మీ అవసరాలకు అనుగుణంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి ఆర్డర్లు ఇవ్వాలి.
6. ప్రసార భారతిలో మాదిరిగానే ఉద్యోగులకు భద్రత కల్పించాలి.

## సిఐ టార్చర్ భరించలేకపోతున్నా

**కరీంనగర్ :**

కరీంనగర్ జిల్లాలో ఓ వ్యక్తి మృతి కలకలం రేగింది. ఆయన రాసిన సూసైడ్ నోట్ అధికార వర్గాల్లో తీవ్ర చర్చ రేపింది. చొప్పదండి మండలంలో భూపాలపట్నం గ్రామంలో నివాసం ఉండే బొడిగే శ్యామ్ అలియాస్ సాంబయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్న సాంబయ్య ఓ సూసైడ్ నోట్ రాసి పెట్టాడు. అందులో చెప్పిన కారణాలు సంచలనంగా మారుతున్నాయి. ఇప్పుడు ఆ కేసు ఓ సెంట్రల్ ఇంటెలిజెన్స్ డిపార్ట్మెంట్ అధికారి మెడకు చుట్టుకునేలా కనిపిస్తోంది. ఓ భూమి విషయంలో ఇంటెలిజెన్స్ డిపార్ట్మెంట్ సి.ఐ గోపీ బెదిరించాడని అంటూ లేఖ రాసిన సాంబయ్య... తన చావు ఆయనే కారణమంటూ పేర్కొన్నాడు. నా చావుకు సెంట్రల్ ఇంటెలిజెన్స్ డిపార్ట్మెంట్ సి.ఐ గోపీ కారణం అంటూ నోట్ రాసి తనువు చాలించడం కరీంనగర్ జిల్లాలోనే తీవ్ర దుమారాన్ని రేపుతోంది. చొప్పదండి మండలం భూపాలపట్నంలో ఇరవై గుంటలు భూమిని ఇంటలిజెన్స్ సిఐ గోపీ కొనుగోలు చేశారు. ఆ భూమిని చొప్పదండికి చెందిన సాంబయ్య మధ్యవర్తిగా సేల్ చేశాడు. ఇదే ఇద్దరి మధ్య చిచ్చుకు కారణమైంది. ఇరవై గుంటల భూమిని యాభై లక్షలకి కొన్న సీఐ భారీ లాభాలు ఆశించారు. అదే టైంలో ఆ ల్యాండ్‌ను అమ్మకానికి ఉందని సాంబయ్య సమాచారం ఇచ్చాడు. పది లక్షల లాభం వస్తుందని సూచాయిగా చెప్పాడు. కాలక్రమేనా రియల్ ఎస్టేట్ భూం పడిపోయింది. రియల్ ఎస్టేట్ భూమ్ పడిపోవడంతో ఆ ల్యాండ్‌కు అనుకున్న ధర రాలేదు. ప్లాట్లు కూడా అమ్ముడు పోలేదు. దీంతో సీఐ గోపీకి ఆరు లక్షలు మాత్రమే సాంబయ్య ఇచ్చాడు. తనకు పది లక్షలు వస్తుందని చెప్పారని మిగతా సొమ్ములు కూడా ఇవ్వాలంటూ ఒత్తిడి తీసుకొచ్చారు. అధికారి కావడంతో మరింత కఠినంగా బెదిరించినట్టు కుటుంబ సభ్యులు, ఇతర సాక్ష్యాలు చూస్తుంటే అర్థమవుతుంది. నాలుగు లక్షలు తీసుకొచ్చి ఇవ్వలేక సీఐ గోపీ వేధింపులు భరించ లేక సూసైడ్ చేసుకున్నాడు సాంబయ్య. గోపీ వేధింపుల కారణంగానే చనిపోతున్నట్టు సూసైడ్ నోట్ రాసి తనువు చాలించాడు. ఉదయం నుంచి సాయంత్ర వరకు అక్కడే ఉన్న వైసీపీ శ్రేణులు చంద్రబాబు వచ్చే టైంలో కూడా నినాదాలు చేశారు. అటుగా వెళ్తున్న టీడీపీ కార్యకర్తలు కూడా వైసీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## రక్షణ మంత్రికి కిషన్ రెడ్డి ధన్యవాదాలు

**హైదరాబాద్ :**

రక్షణ మంత్రికి ధన్యవాదములు- కంటోన్మెంట్ లోని 5 ప్రధాన రహదారుల ద్వారా సామాన్య ప్రజల రాకపోకలకు అనుమతించిన నేపథ్యంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి- పలుమార్లు ఈ అంశంపై రక్షణ మంత్రిని కలిసి క్షేత్రస్థాయి సమస్యలను వెల్లడించానన్న కేంద్రమంత్రి- ప్రజాజీవనాన్ని సౌలభ్యంగా మార్చడమే నరేంద్రమోదీ సర్కారు లక్ష్యమన్న కిషన్ రెడ్డి22 ఏప్రిల్, 2023, హైదరాబాద్‌సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలోని 5 రహదారులను (రిచర్డ్‌సన్ రోడ్, ప్రోట్నీ రోడ్, బయామ్ రోడ్, అమ్ముగూడ రోడ్, అల్బయిన్ రోడ్) సామాన్య ప్రజల వినియోగానికి తెరిచేందుకు రక్షణ శాఖ అనుమతించడం పట్ల కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇందుకుగానూ రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారికి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు. 'సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలోని రిచర్డ్‌సన్, ప్రోట్నీ, బయామ్, అమ్ముగూడ, అల్బయిన్ రోడ్లను సామాన్య ప్రజల రాకపోకల కోసం అనుమతించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల రాజ్ నాథ్ సింగ్ ధన్యవాదములు తెలియజేస్తున్నాను. పలుమార్లు ఈ అంశంపై వారిని కలిసి సమస్యను విన్నవించాను. రోడ్లను తెరిచేందుకు వారు మనస్ఫూర్తిగా అంగీకరించారు' అని కిషన్ రెడ్డి ట్వీట్ చేశారు.'జాతీయ భద్రత, ప్రజలకు సౌలభ్యం అనే రెండు సున్నితమైన అంశాల విషయంలో అన్ని పక్షాలు కలిసి కూర్చుని చర్చించుకుని పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉంది. రాజ్‌నాథ్ సింగ్ గారిని కలిసిన సందర్భంలో.. కంటోన్మెంట్ ప్రాంతానికి నీరు, విద్యుత్ సరఫరా నిలిపేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన బెదిరింపులు.. తదితర అంశాలను కూడా తెలియజేశాను'అని కిషన్ రెడ్డి వెల్లడించారు. నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాజీవనాన్ని సౌలభ్యం చేసేందుకు కృషిచేస్తోందని కేంద్రమంత్రి ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు.

## మోర్తాడ్ లో రైతుల ఆందోళన

**నిజామాబాద్**

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ లో రైతులు అందోళనకు దిగారు. కడ్త పేరుతో ధాన్యం తూకంలో మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. సొసైటీ ఛైర్మెన్ కార్యదర్శి ని సహకార సంఘం కార్యాల యంలో నిర్బంధించి నిరసన తెలిపారు. సొసైటీ వద్ద వంటా వార్పు చేసారు.

## బిజెపి జిల్లా కార్యాలయ కార్యదర్శిగా దివాకర్

**జగిత్యాల**

భారతీయ జనతాపార్టీ జగిత్యాల జిల్లా కార్యాలయ కార్యదర్శిగా జుంబర్తి దివాకర్ నియమకమయ్యారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో జగిత్యాల జిల్లాలో బిజెపి బలోపేతానికి కృషి చేస్తున్న సందర్భంలో జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులను, శ్రేణులను అనుసంధానం చేసేందుకు సమర్థుడైన కార్యకర్త అవసరం అన్న కోణంలో శోధించడము జరిగిందన్నారు. ఈనేపథ్యంలో జగిత్యాల బీజేపీలో వివాదరహితుడైన దివాకర్ సమర్థుడని భావించి బిజెపి కార్యాలయ కార్యదర్శిగా నియమించడం జరిగిందని జిల్లా అద్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావు పేర్కొన్నారు. తనపై అమితమైన విశ్వాసంతో తన నియామకానికి కృషిచేసిన సత్యనారాయణ రావు తోపాటు మిగతా అందరికి దివాకర్ పేరు పేరు నా కృతజ్ఞతలు తెలిపారు.

# విజయ సంకల్ప సభ ఓ సంచలనం కావాలి

**హైదరాబాద్**

'రేపు చేవెళ్లలో జరగబోయే "విజయ సంకల్ప సభ" తెలంగాణలో సంచలనం కావాలి. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో నిర్వహిస్తున్న ఈ సభకు లక్ష మందికి తగ్గకుండా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉంది. కార్యకర్తలంతా స్వచ్ఛందంగా ఈ సభకు హాజరై విజయవంతం చేయాలి. తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయమనే సంకేతాలను ఈ సభ ద్వారా పంపాలి"అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు.

ఈరోజు జిల్లా అధ్యక్షులు, పార్టీ రాష్ట్ర నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన బండి సంజయ్ ఆదివారం చేవెళ్లలో జరగబోయే బహిరంగ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వస్తున్న నేపథ్యంలో సభ విజయవంతానికి ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త క్రుషి చేయాలని కోరారు.పార్లమెంట్ పరిధిలో జరగబోయే తొలి సభను సక్సెస్ చేయడం ద్వారా తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయమనే నమ్మకాన్ని జాతీయ నాయకత్వానికి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో నియంత, నిక్రుష్ణ, అవినీతి పాలన కొనసాగుతోందని, కేసీఆర్ వల్ల కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలంతా బీజేపీపట్ల నమ్మకంతో ఉన్నారని, ఈ నేపథ్యంలో పార్టీని అణిచివేసేందుకు సీఎం కేసీఆర్ రాబోయే రోజుల్లో కార్యకర్తలను మరింత ఇబ్బందికి గురిచేసే ప్రమాదం ఉందని, అయినా ప్రజలు, పార్టీ అండగా ఉన్నందుకు కార్యకర్తలు భయపడాల్సిన పనిలేదన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అవినీతిరహిత పాలన కొనసాగుతోందని, తెలంగాణలోనూ అలాంటి పాలనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. చేవెళ్ల సభ ద్వారా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం... రామరాజ్య స్థాపన తథ్యమనే సంకేతాలను పంపబోతున్నట్లు చెప్పారు. ఈ సభను సక్సెస్ చేయాలని కోరుతూ ప్రతి ఒక్కరూ మీడియా, సోషల్ మీడియా వేదికగా విస్త్రత ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు.

# యర్రగొండ పాలెం ఘటనపై టీడీపీ సీరియస్

**ఒంగోలు :**

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో జరిగిన ఘటనలపై తెలుగుదేశం పార్టీ చాలా సీరియస్‌గా చూస్తోంది. ఎన్ఎస్‌జీ భద్రతలో ఉన్న వ్యక్తిపై రాళ్ల దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్న ఆ పార్టీ... ఫిర్యాదు చేయడానికి నిర్ణయించినట్టు సమాచారం. ముఖ్య నేతలతో అధినేత చంద్రబాబు నాయుడు మాట్లాడారు. గవర్నర్‌తోపాటు ఇతరులకు ఫిర్యాదు చేయాలని దీనిపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. మంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలోనే రాళ్ల దాడి జరిగిందని తెలుగుదేశం నేతలు ఆరోపిస్తున్నారు. ఆయనే స్వయంగా పార్టీ శ్రేణులను రెచ్చగొట్టి టీడీపీ అధినేతపైకి ఉసిగొల్పారని విమర్శిస్తున్నారు. ఈ దాడిలో కార్యకర్తలతోపాటు, చంద్రబాబు భద్రతా సిబ్బందికి కూడా గాయాలు అయినట్టు చెబుతున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన వివరాలను రాజ్‌భవన్‌కు ఈమెయిల్ ద్వారా వివరాలు పంపించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నేరుగా నాయకులు కూడా వెళ్లి గవర్నర్‌కు ఫిర్యాదు చేయనున్నారు. అదే టైంలో కేంద్రానికి కూడా ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు. ఈ ఘటనతోపాటు వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జరిగిన దాడులన్నింటినీ ప్రస్తావించనబోతున్నట్టు సమాచారం. గతంలో కూడా చాలా సార్లు చంద్రబాబుపై దాడికి యత్నించారని గుర్తు చేస్తున్నారు నాయకులు. వాటన్నింటినీ ఈ ఫిర్యాదులో పొందుపరిచే ఛాన్స్ ఉందని చెబుతున్నారు. అధినేతతోపాటు సామాన్యులపై కూడా జరుగుతున్న దాడులను వివరించనున్నారు. ప్రకాశం జిల్లా యర్రగొండుపాలెంలో రాత్రి హైటెన్షన్ వాతావరణం కనిపించింది. ఓవైపు చంద్రబాబు టూర్ అదే టైంలో ఆయనకు వ్యతిరేకంగా మంత్రి ఆదిమూలపు సురేష్ నిరసన చేపట్టారు. ఈ రెండింటి మధ్య పోలీసులు, భద్రతా సిబ్బంది కాసేపు హడావుడి నడిచింది. ఓవైపు రాళ్లవర్షం మరోవైపు పోలీసులు లాఠీఛార్జ్‌తో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సవాళ్లు ప్రతిసవాళ్లతో ప్రకాశం జిల్లా ఒక్కసారిగా హీట్ ఎక్కింది. తెలుగుదేశం అధినేత చంద్రబాబు చేస్తున్న విమర్శలతో ఆయన టూర్‌ను అడ్డుకునేందుకు మంత్రి ఆదిమూలపు సురేష్ సీన్‌లోకి రావడంతో ప్రశాంతంగా ఉన్న సిట్యుయేషన్ ఒక్కసారిగా వైల్డ్‌గా మారిపోయింది. దళితులకు క్షమాపణ చెప్పిన తర్వాత తన నియోజకవర్గంలో పర్యటించాలని ఆదిమూలపు సురేష్ తమ పార్టీ కార్యకర్తలతో చంద్రబాబుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఆదిమూలపు సురేష్ పిలుపుతో భారీగా పార్టీ శ్రేణులు ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. నల్ల జెండాలు, బెలూన్లు పట్టుకొని టీడీపీకి, చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చంద్రబాబు గోబ్యాక్ అంటూ స్లోగన్స్ ఇచ్చారు. మంత్రి ఆదిమూలపు సురేష్ కూడా బ్లాక్ టీషర్టుతో నిరసన కార్యక్రమాల్లో పాల్గొని సీన్ హీట్ పెంచారు.

మరోవైపు అదే రూట్‌లో వస్తున్న తెలుగుదేశం అధినేత చంద్రబాబు, ఆయన వెంటనే భారీగా పార్టీ శ్రేణులు ఫాలో అయ్యారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న టెన్షన్ పోలీసుల్లో కనిపించింది. రోజుంతా కనిపించిన హైడ్రామా రాత్రికి మరింత వేడి జగన్‌కు, ఆదిమూలపు సురేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగానే ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# బస్ భవన్ నుంచి వర్చ్‌వల్‌గా టాక్ట్ శిక్షణ

**న్యూఢిల్లీ :**

ఇప్పుడంటే ఏమోగానీ, ఒకప్పుడైతే ఒంటిమీద ఖాకీచొక్కా వేసుకున్న బస్ కండక్టర్ కండాక్టర్ సరిగా ఉండేది కాదని జనం బాహాటంగానే విమర్శించేవారు. ఇది మొదట్నుంచీ ఆర్టీసీకి మహాచెడ్డ పేరులా ఉండిపోయింది. రూడ్‌గా మాట్లాడుతారని, ప్రయాణికుల పట్ల సభ్యతగా ఉండరని ఆరోపణలు ఉండేవి. అప్పట్లో ఆర్టీసీ మర్యాద వారోత్సవాల పేరుతో ప్రత్యేకంగా ఓ ప్రోగ్రాం కండక్ట్ చేశారు. అవి ఎంతవరకు సత్ఫలితాలనిచ్చాయో తెలియదు కానీ, ఎవరో ఒకరిద్దరు చేసిన తప్పులకు సంస్థ ఒక పెద్ద అపవాదుని మోయాల్సి వచ్చింది. అలాంటి చెడ్డపేరును తుడిచేయాలనే ఉద్దేశంతోనే ఎండీ సజ్జనార్ మరోసారి మర్యాద అనే కాన్సెప్టుని తెరమీదికి తీసుకొచ్చారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న డిపోల్లో కండక్టర్లకు టూ ఖీఅ ఏప్రిల్ ఛాలెంజ్ ఫర్ ట్రైనింగ్(టాక్ట్) శుక్రవారం ప్రారంభమైంది. హైదరాబాద్ బస్ భవన్ నుంచి వర్చ్‌వల్‌గా ఈ శిక్షణ జరుగుతున్న తీరును సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ పరిశీలించారు. శిక్షణలో పాల్గొన్న కండక్టర్లతో ముచ్చటించారు. శిక్షణ జరుగుతున్న తీరు, చెబుతున్న విషయాల ఉపయోగం, తదితర అంశాలపై వారిని అడిగి తెలుసుకున్నారు."మనం ప్రయాణికుల కేంద్రంగానే పని చేయాలి. ప్రయాణికులతో ఎట్టి పరిస్థితుల్లోనూ దురుసుగా ప్రవర్తించొద్దు. బస్సులోకి రాగానే వారిని నమస్తే అంటూ చిరునవ్వుతో పలకరించాలి. కొత్త ప్రయాణికులను మన సంస్థ వైపు మెగ్గుచూపేలా వ్యవహారించాలి. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలు చాలా ఉన్నాయనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని విధులు నిర్వహించాలి. విధి నిర్వహణలో స్వీయ క్రమశిక్షణను కలిగి ఉండాలి." అని కండక్టర్లకు సంస్థ ఎండీ సజ్జనర్ హితవు పలికారు. గత ఏడాదిన్నర కాలంలో సంస్థలో ఎన్నో మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. ఇంకా చేయాల్సింది చాలా ఉందని, అందుకే టాక్ట్ పేరుతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నామన్నారు సజ్జనర్"రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను ప్రజలు బాగా ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం ఆక్యూపెన్సీ రేషియో (ఓఆర్) 69గా ఉంది. దానిని 75కి పెంచాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగానే సంస్థలో ప్రతి ఒక్క సిబ్బందికి టాక్ట్ పేరుతో శిక్షణ ఇస్తున్నాం. ఆ లక్ష్యానికి అనుగుణంగా అందరూ పనిచేయాలి." అని సజ్జనర్ స్పష్టం చేశారు. ఈ శిక్షణ స్ఫూర్తితో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి.. సంస్థ లాభాల బాటలో పయనించేలా పాటుపడాలన్నారు. ఇటీవల రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్లలోని దాదాపు 6 వేల మంది డ్రైవర్లకు టాక్ట్ శిక్షణను ఇచ్చామని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో సంస్థలోని సిబ్బంది అందరికీ శిక్షణ ఇస్తామని సజ్జనర్ పేర్కొన్నారు. టాక్ట్ పేరుతో తమకు అందిస్తోన్న ఈ శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉందని కండక్టర్లు సంస్థ ఎండీ సజ్జనర్‌కు చెప్పారు. తమలో ఉన్న నైపుణ్యాన్ని బయటికి తీసుకురావడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని వివరిం చారు. ప్రయాణికుల మీదనే సంస్థ ఆధారపడి ఉందనే విషయాన్ని తాము మరిచి పోమన్నారు. ఓఆర్‌ను 75కి పెంచేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చాం

# జగదాంబకు బంగారు నంది అవార్డు

**హైదరాబాద్ :**

ప్రముఖ సంఘ సేవకురాలు జగదాంబ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు,హేల్ టాటా మణి చారిటబుల్ ట్రస్టు సభ్యులు జగదాంబకు సికింద్రాబాద్ హరిహర కళాభవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో వేలూరి ఫౌండేషన్ సంస్థ ఉగాది పురస్కారాల సందర్భంగా బంగారు నంది అవార్డును ప్రదానం చేసింది. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జగదాంబ సేవాలను గుర్తించి వేలూరి



ఫౌండేషన్ సంస్థ ఈ అవార్డు ను ప్రముఖ సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా అందజేసింది .ఈ సందర్భంగా జగదాంబ మాట్లాడుతూ చేసే ప్రతి పని ప్రశాంత జీవనం గడుపడానికి దోహద పడుతుందని పలు సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. పేదలకు సాయం చేయడంలో ఉన్న సంతృప్తి మరెందు లోనూ లేదని అన్నారు. తాను తన మిత్రులు శ్రేయోభిలాషుల సహకారంతో తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా సేవలు చేస్తున్నామని, పేదల ఆకలి తీర్చడం తమ బాధ్యతగా పలు కార్యక్రమాలు నిర్వహించామని జగదాంబ వెల్లడించారు.

## కేసీఆర్ పై పోరాడండి

**హైదరాబాద్ :**

ఈటల రాజేందర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఒకరిపై ఒకరు పోరాడటం కాకుండా ఎవరి దారిలో వారు బీఆర్ఎస్‌పై పోరాడాలని బీజేపీ సీనియర్ నేత విజయశాంతి సలహా ఇచ్చారు. వారిద్దరూ ఒకరికొకరు సవాళ్లు చేసుకుంటున్న విషయంపై ఆమె సోషల్ మీడియాలో స్పందంచారు. దేశంలోనే అత్యంత ధన ప్రభావిత ఎన్నికల కార్యాచరణ తెలంగాణలో కొనసాగుతున్నదని.. ఇందుకు కారణంగా ఉన్న అసలైన దుర్మార్గ వ్యవస్థపై పోరాడవలసిన కర్తవ్యం మనకు తప్పనిసరిగా ఉన్నదనేది నిజమని వారిద్దరికీ విజయశాంతి గుర్తు చేశారు. ఈ విధానాన్ని అధికారపార్టీ ప్రజాస్వామ్య హనన రాజకీయ దుష్కృత్య ధోరణులపై కాక, ప్రతిపక్షాల నేతలు పరస్పరం చేసుకునే మాటల, సవాళ్ల దాడులు, బీఆరెస్‌కు ఉపయోగ పడుతున్నాయన్నారు. ఈటల, రేవంత్ రెడ్డిలను తమ్ముళ్లుగా పేర్కొన్న విజయంశాంతి.. తమ దాడిని ఒకరిపై ఒకరు కాకండా ఎవరి ధోరణిలో వారు ప్రభుత్వంపై పోరాడటం అవసరమేమో... ఈ సందర్భంలో కొంచెం ఆలోచించాలని సలహాఇచ్చారు. తెలంగాణ ప్రస్తుత పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉన్న ఇద్దరికీ...నిరంతర తెలంగాణ ఉద్యమకారిణిగా ప్రజల అభిప్రాయం చెప్పడం ఈ సందర్భంలో నా బాధ్యత అనిపించిందని గుర్తు చేసుకున్నారు.మునుగోడు ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ డబ్బులిచ్చారని ఈటల ఆరోపణమునుగోడు ఉపఎన్నిక సందర్భంగా కేసీఆర్ నుంచి కాంగ్రెస్ పార్టీకి రూ.25 కోట్లు ముట్టాయని ఈటల రాజేందర్ ఆరోపించారు. ఈటల వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈరోజు భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద తడి బట్టలతో ప్రమాణం చేసేందుకు సిద్ధమా అంటూ ఈటలకు రేవంత్ సవాల్ విసిరారు. దమ్ముంటే ఈరోజు సాయంత్రం భాగ్యలక్ష్మి అమ్మవారి గుడికి వచ్చి ప్రమాణం చేయాలని రేవంత్ సవాల్ చేశారు. అయితే ఇంత చర్చకు కారణమైన ఈటల రాజేందర్ మాత్రం ఇంకా స్పందించలేదు. అందుకు కేంద్రమంత్రి అమిత్ షా పర్యటనలో బిజీగా ఉండటమే కారణంగా చెబుతున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో అమిత్‌షా పర్యటించనున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు బిజీబిజీగా ఉన్నారు. అమిత్ పర్యటన నేపథ్యంలో రేవంత్ సవాల్‌పై స్పందించేది లేదని ఈటల రాజేందర్ చెబుతున్నారు. అమిత్ షా పర్యటన నుంచి దృష్టి మళ్లించేందుకు రేవంత్ రెడ్డి ఇలా చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అమిత్ షా చేవెళ్ల సభ పూర్తయిన తర్వాత ఈటల రాజేందర్ స్పందించే అవకాశం ఉంది. అయితే ఈ అంశంపై మరో కాంగ్రెస్ సీనియర్ నేత డీకే అరుణ స్పందించారు. రేవంత్ రెడ్డి ఇష్యూలో కాంగ్రెస్ కు బీఆర్ఎస్‌కు వత్తాసు పలుకుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ వత్తాసు పలకడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. వాస్తవాలు మాట్లాడితే రేవంత్ కు అంత ఉలిక్కిపాటు ఎందకని ప్రశ్నించారు. దుబ్బాక ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటైంది వాస్తవం కాదా అని డీకే అరుణ ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఈ వివాదం అంతకంతకూ పెరిగే సూచనలే కనిపిస్తున్నాయి

## నిరసన దీక్షలో పాల్గొంటా

**నల్గొండ :**

నల్గొండ అంటే నాకు ప్రాణం.. అందుకే రానున్న ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేస్తానని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంచలన ప్రకటన చేశారు. ప్రస్తుతం కోమటిరెడ్డి భువనగిరి లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యంవహిస్తుండగా.. నల్గొండ నియోజకవర్గం నుంచి మాజీ పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎంపీగా ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో భువనగిరి నుంచి కాదని.. నల్గొండ నుంచి తాను పోటీ చేస్తానని కోమటిరెడ్డి వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ఆసక్తికర పరిణామం. దీనిపై ఉత్తమ్ ఎలా స్పందిస్తారన్నది రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కాగా ఈనెల 28న నల్లగొండలో జరిగే నిరుద్యోగ నిరసన సభలో పాల్గొంటానని ఎంపీ కోమటిరెడ్డి తెలిపారు.పీసీసీ తనను సంప్రదించకుండానే నల్గొండలో నిరుద్యోగ నిరసన దీక్షను చేపట్టినందున.. ఇందులో పాల్గొనని ఉత్తమ్ గతంలో ప్రకటించారు. దీనిపై ఆయన పార్టీ హైకమాండ్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. నల్గొండలో తలపెట్టిన నిరుద్యోగ నిరసన దీక్ష వాయిదాపడింది. దీంతో రంగంలోకి దిగిన ఏఐసీసీ సెక్రటరీ నదీమ్ జావిద్.. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు మరికొందరు పార్టీ సీనియర్ నేతలతో విడివిడిగా మాట్లాడినట్లు తెలుస్తోంది. పార్టీ బలోపేతం కోసం చేపట్టిన నిరుద్యోగ నిరసన సభను సజావుగా జరిగేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఆ మేరకు ఏప్రిల్ 28న నల్గొండలో నిరసన సభను నిర్వహించేందుకు పార్టీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పుడు ఈ సభలో పాల్గొంటానని ఎంపీ కోమటిరెడ్డి ప్రకటించడం నల్గొండ కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్

**మెట్ పల్లి**

మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ నిలుస్తుందని టీపీసీసీ డెలిగేట్ మెంబర్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కల్వకుంట్ల సుజీత్ రావు అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని మెట్ పల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మెట్ పల్లి మర్కజి ఇంతియాజి కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఖుతుబోద్దిన్ పాషా నివాసంలో జరిగిన రంజాన్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్ ను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనదని, రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరి, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. మతసామరస్యానికి ప్రతీక రంజాన్ మాసమన్నారు.

ప్రజా తపన
prajathapana.com

# కండువా కప్పుకోవటం ఖాయమేనా

**హైదరాబాద్ :**





మరికొద్ది నెలల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు వ్యూహాలు, ప్రతివ్యూహాలు రచించే పనిలో పడ్డాయి. ఓ వైపు ప్రజల్లోకి వెళ్తూనే... ప్రత్యర్థులను ఢీకొట్టేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నాయి. ఇక గతంలో జరిగిన ఎన్నికల్లో తేలిపోయిన కాంగ్రెస్... వచ్చే ఎన్నికలను మాత్రం చావోరేవోగా భావిస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పాదయాత్రతో ప్రజల్లోకి వెళ్లారు. త్వరలోనే గద్వాల నుంచి రెండో దశ పాదయాత్ర కూడా చేపట్టనున్నారు. ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను కోరుతున్నారు. ముఖ్య నేతలు కూడా ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే ఇదే సమయంలో కీలక నేతలను రప్పించే పనిలో పడింది తెలంగాణ కాంగ్రెస్. ఆ దిశగా చర్చలు కూడా జరుపుతోంది.నిజానికి 2018 ఎన్నికల్లో ఓటమి తర్వాత కాంగ్రెస్ నుంచి చాలా మంది నేతలు వెళ్లిపోయారు. అయితే క్రమంగా చాలా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొవాల్సి వచ్చింది. మరోవైపు అంతర్గత కుమ్ములాటలతో ఉక్కిరిబిక్కిరి అయింది. ఇదే సమయంలో హైకమాండ్ రంగంలోకి దిగటంతో పలు మార్పులను చేపట్టింది. రేవంత్ రాకతో దూకుడు పెరిగింది. ప్రస్తుతం పాదయాత్రలతో ప్రజల్లోకి వెళ్తోంది. వరంగల్ డిక్లరేషన్ తో పాటు పలు హామీలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. ఇక కీలక నేతలను పార్టీలోకి రప్పించి అధికార బీఆర్ఎస్ కు గట్టి సవాల్ ను విసరాలని చూస్తోంది. ఈ క్రమంలోనే ఖమ్మం జిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో చర్చలు జరుపుతోంది. మరోవైపు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి జూపల్లితో కూడా మంతనాలను వేగవంతం చేసింది. ఇక వీరే కాకుండా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డితో చర్చలు పూర్తి అయినట్లు తెలుస్తోంది. స్థానికంగా ఉండే నేతలను కూడా రంగంలోకి దింపి? ఇబ్బందులు రాకుండా చూసే పనిలో పడింది రాష్ట్ర నాయకత్వం.నిరుద్యోగులు అంశం, పేపర్ లీకేజీలో వాస్తవాలు, ఉద్యోగాల భర్తీపై బీఆర్ఎస్ ఇచ్చిన హామీలపై పోరాటం చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇందులో భాగంగా పలు జిల్లాల్లో నిరుద్యోగ నిరసన దీక్షలు నిర్వహించి? మే మొదటి వారంలో హైదరాబాద్ వేదికగా భారీ సభను తలపెట్టాలని డిసైడ్ అయింది. ఈ సభకు పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీని రప్పించనున్నారు. ఆమె సమక్షంలోనే కీలక నేతలంతా కాంగ్రెస్ కండువా కప్పుకుంటారని తెలుస్తోంది. అయితే వీరే కాకుండా? మరికొందరు నేతలు కూడా కాంగ్రెస్ లోకి వస్తారన్న టాక్ వినిపిస్తోంది.మొత్తంగా మరికొద్ది నెలల్లోనే ఎన్నికలు రానున్న వేళ... కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు, ప్రతివ్యూహాలను సిద్ధం చేసే పనిలో పడింది. ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోంది. ఎన్నికల్లో గెలిచే రేసు గుర్రాలపై కూడా ఫోకస్ పెట్టే పనిలో పడింది. ఓవైపు ప్రజల్లో ఉంటూనే... పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టిపెడుతోంది.

**కాంగ్రెస్ గూటికి సిట్టింగ్ ఎమ్మెల్సీ**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో చేరికలు పెరుగుతున్నాయి. పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు త్వరలో పార్టీలో చేరబోతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. త్వరలో బీఆర్ఎస్ నుంచి మరో ఎమ్మెల్సీ కూడా కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నాగర్ కర్నూలుకు చెందిన భారత రాష్ట్ర సమితి సీనియర్ నేత, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి పార్టీకి గుడ్ బై చెప్పాలని నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అయన రంగం సిద్ధం చేసుకున్నారు. భారత రాష్ట్ర సమితి తరపున నాగర్ కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి ఉన్నారు. ఆయనతో సరిపడకపోవడంతో పార్టీ మారాలని నిర్ణయించారు. పార్టీ హైకమాండ్ కూడా మర్రి జనార్ధన్ రెడ్డికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇరువురు మధ్య నెలకొన్న విభేదాలు తారాస్థాయికి చేరడం అధినాయకత్వం పట్టించుకోకపోవడంతో కలత చెందిన దామోదర్ రెడ్డి పార్టీని వీడాలన్న నిర్ణయానికి వచ్చినట్టు అయన సన్నిహితులు చెబుతున్నారు.అయితే దామోదర్ రెడ్డి చేరిక పట్ల సీనియర్ నేత కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి అసంతృప్తిగా ఉన్నారు ఆయనను ఒప్పించే బాధ్యతను పార్టీ అగ్ర నేత జానారెడ్డికి అప్పగించినట్లు సమాచారం. గతంలో జానారెడ్డి సమక్షంలోనే ఈ ఇరువురు నేతలు చర్చలు జరపనున్నట్లుగా తెలు?సతోంది. నాగంకు నచ్చజెప్పి దామోదర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకునేందుకు లైన్ క్లియర్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ తతంగం అనుకున్నట్లుగా జరిగితే మే మొదటి వారంలో ఇక్కడి సరూర్ నగర్ స్టేడియంలో జరిగే భారీ బహిరంగ సభలో దామోదర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి ప్రియాంక గాంధీ హాజరవుతున్నారు. నాగర్ కర్నూలు నియోజక వర్గం లోని తాడూరు మండలానికి చెందిన దామోదర్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరక ముందు కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత స్థానిక సంస్థల తరపున శాసనమండలికి ఎంపికై ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ తరపున నాగం జనార్ధన్ రెడ్డి కీలకంగా ఉన్నప్పుడు కాంగ్రెస్‌లో ఆయనకు ప్రత్యర్థిగా దామోదర్ రెడ్డి ఉండేవారు. ఈ కారణంగానే వ్యతిరేకిస్తున్నారు. అయితే ఇప్పుడు ఆయన చేరికను నాగం స్వాగతిస్తే.. సమస్య పరిష్కారమైనట్లే. లేకపోతే ఆయన పార్టీ మార్పు వల్ల బీఆర్ఎస్ పార్టీలో తగ్గిపోయే వర్గపోరు.. కాంగ్రెస్ పార్టీలోకి వస్తుంది.

# ఉద్యమకారులు అసంతృప్తిగా ఉన్నది వాస్తవమే

**హైదరాబాద్ :**



తమకు ప్రాధాన్యం ఉండడం లేదని ఉద్యమకారులు అసంతృప్తిగా ఉన్నది వాస్తవమేనని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్అన్నారు. ఎవరూ తొందరపడవద్దని, అందరికీ అవకాశం వస్తుందని చెప్పారు. కంటోన్మెంట్ ఒకటవ వార్డుకు సంబంధించిన బీఆర్ఎస్పార్టీ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం బోయినపల్లి మల్లారెడ్డి గార్డెన్‌లో జరిగింది. కంటోన్మెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రులు చామకూర మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జి దాసోజుల శ్రావణ్, తెలంగాణ బేవరేజెస్ చైర్మన్ గజ్జెల నగేష్, తెలంగాణ మినరల్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా దివంగత ఎమ్మెల్యే సాయన్న చిత్రపటానికి తలసాని, మర్రి రాజశేఖర్‌రెడ్డి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజక వర్గంనాయకులంతా ఒకతాటిపైకి వచ్చి రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని అన్నారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతానికి చేసింది ఏమీలేదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంలో కేసీఆర్, మోదీ మధ్య వ్యత్యాసాన్ని మన్నె క్రిశాంక్ ప్లకార్డుల ద్వారా ప్రదర్శించారు.

# మన్ కీ బాత వందో ఎపిసోడ్

**న్యూఢిల్లీ :**

మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ సందర్భంగా ప్రధాని మోదీ దేశానికి ఓ గిఫ్ట్ ఇవ్వనున్నారు. ఏప్రిల్ 30 మన్ కీ బాత్ 100 వ ఎపిసోడ్ ప్రసారం కానుంది. ఈ సమయంలోనే ప్రధాని రూ. 100 కాయిన్ విడుదల చేయనున్నారు. ఈ కాయిన్‌లో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. దీనిపై మైక్రోఫోన్ సింబల్ ఉంటుంది. దీంతో పాటు 2023 అని ప్రింట్ చేసి ఉంటుంది. ఈ మేరకు అధికారికంగా ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కేవలం ఒక్క కాయిన్‌ని మాత్రమే ప్రింట్ చేయనున్నారు. ఈ కాయిన్ సైజ్ 44 ఓ.ఓ. వెండి, రాగి, నికెల్, జింక్‌తో దీన్ని తయారు చేశారు. కాయిన్ ముందు అశోక స్తంభం కనిపించనుంది. దాని కింద సత్యమేవ జయతే అని రాసి ఉంటుంది. ఓ వైపు ఎనిటతిజీ అని ప్రింట్ చేయనున్నారు. రూపీ సింబల్ కూడా ఉంటుంది. మైక్రోఫోన్ సింబల్‌తో పాటు సౌండ్ వేవ్స్ సింబల్ కూడా ప్రింట్ చేయనున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. హిందీ, ఇంగ్లీష్ భాషల్లో 'ఓజీనిని ఐతి ఃజీజీబి 100' అని ప్రింట్ చేయనున్నారు. ఈ కాయిన్ బరువు 35 గ్రాములు. ఇప్పుడే కాదు. రూ. 100 కాయిన్‌లు గతంలోనూ చాలా సందర్భాల్లో ప్రింట్ చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయీ స్మారకార్థం గతంలో ప్రధాని నరేంద్ర మోదీ 100 రూపాయల కాయిన్ విడుదల చేశారు. రాజ్‌మాత విజయ్‌రాజ్ సింధియా శత జయంతి సందర్భంగా కూడా రూ. 100 కాయిన్ విడుదల చేశారు. మహారాణ ప్రతాప్ 476వ జయంతి సందర్భంలోనూ ఇదే విధంగా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఓ కాయిన్ ప్రింట్ చేసింది. 2010, 2011,2012, 2014, 2015లో ఇలాంటి కాయిన్స్ ప్రింట్ చేయించింది కేంద్రం. ఈ సారి 100వ ఎపిసోడ్ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది కేంద్రం. దాదాపు లక్ష బూత్‌ల వద్ద ఈ కార్యక్రమాన్ని ఎయిర్ చేయనున్నారు. కొన్ని చోట్ల అధికారులు ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమంపై అవగాహన పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు.

# 4 లక్షలబిర్యానీలు అమ్మకాలు

**హైదరాబాద్ :**

రంజాన్ మాసం అంటే ముస్లీంలకు ఎంత పవిత్రమైనదో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల మేలు కలయికే ఈ రంజాన్ మాసం. ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యమున్న రంజాన్ మాసం ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, దానధర్మాలతో సాగుతుంది. ఈ మాసంలో ముస్లింలు సూర్యోదయానికి ముందు నుంచి సూర్యాస్తమయం వరకు నీరు, ఆహారం, కనీసం లాలాజలం కూడా మింగకుండా కఠోర ఉపవాస దీక్షలు చేస్తారు. వయస్సులో భేదం లేకుండా చిన్నాపెద్దా భక్తి శ్రద్ధలతో ఈ దీక్షలో పాల్గొంటారు. అయితే ఈసారి రంజాన్ మాసంలో బిర్యానీలు, హలీంలు రికార్డు స్థాయిలో అమ్ముడయ్యాయి. మార్చి 23 నుంచి ఏప్రిల్ 18 వరకు స్విగ్గిలో దాదాపు పది లక్షల బిర్యానీలు, 4 లక్షల హలీంలు డెలివరీ అయ్యాయి. ఈ విషయాన్ని స్విగ్గీ తన నివేదికలో వెల్లడించింది. గత ఏడాది రంజాన్ మాసం కంటే ఈఏడాది 20 శాతం అధికంగా ఈ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలు జరిగాయి.చికెన్ బిర్యానీ, హలీంతో పాటు సమోసాలు, భాజియా, మల్పువా, ఫిర్ని, రబ్డి లాంటి ఫుడ్ ఐటెమ్స్ కూడా రికార్డు స్థాయిలో అమ్ముడయ్యాయి. డ్రైఫ్రూట్స్, ఫ్రూట్ సలాడ్స్ సైతం భారీగా ఆర్డర్స్ వచ్చాయని.. మెజార్టీ మాత్రం హలీం, బిర్యానీలకే వచ్చిందని స్విగ్గీ స్పష్టం చేసింది. ఇఫ్తార్ సమయంలో పిస్తా హౌస్ హలీం, ప్యారడైస్ బిర్యాని, మెహ్‌ఫిల్ రెస్టారెంట్ల నుంచి హైదరాబాదీలు ఎక్కువగా ఆర్డర్లు చేశారు. ఉపవాసాలు చేస్తున్న ముస్లీంలు తమ దీక్ష విరమించేందుకు స్విగ్గీ లాంటి ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలకే ఎక్కవ మొగ్గు చూపారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలి

**జగిత్యాల**

అర్హులైన జర్నలిస్టులకు జగిత్యాల జిల్లా కేంద్రంలో నివేశన స్థలాలను వెంటనే మంజూరు చేసి గృహ నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందించాలని సీనియర్ జర్నలిస్టులు ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధ్యావర సంజీవరాజు, జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు ఎన్ జైపాల్, వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు సిరిసిల్ల శ్రీనివాస్, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, ఐజేయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏం. ప్రదీప్ కుమార్, ఐ జె యు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లాల రాజేందర్ రెడ్డి లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాల నుండి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని పదేపదే వాగ్దానం చేస్తూ దాటవేత ధోరణి ఆలంబిస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల కేటాయింపుతో పాటు గృహ నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టులకు ఇళ్లకి స్థలాల కేటాయింపుపై ఏటువంటి స్పందన లేకపోతే రాబోవు రోజుల్లో జర్నలిస్టులందరం యూనియన్లకు అతీతంగా నిరసన కార్యక్రమాలను చేపడతామని నిరాహార దీక్షలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, మాకు రాజలింగం, కోశాధికారి మేన్నెని శ్రీనివాసరావు,కళాశ్రీ గుండేటి రాజు, బెజ్జంకి సంపూర్ణ చారి, లక్ష్మారెడ్డి,ఆనంతుల కాంతారావు లక్ష్మణ్, సిరిసిల్ల వేణుగోపాల్,కొత్తూరి మహేష్ కుమార్, రాజకుమార్, మహేష్ పటేల్, రేణికుంట శ్రీనువాసు,ఆముద లింగారెడ్డి, కడలి మోహన్ రావు, రాజేశ్వర్ రెడ్డి, ఎం. ముఖేష్ రెడ్డి, అక్కినపల్లి బాబు, కాసం శ్రీనివాస్ రెడ్డి,గణేష్ లవంగా, సిరిపురం శ్రీనివాస్, గోనె గంగాధర్, గౌరీశంకర్, రాజేశ్వర్ రెడ్డి లు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 30న పోలీసు కానిస్టేబుల్ తుది రాతపరీక్షలు

**హైదరాబాద్ :**

తెలంగాణలో పోలీసు ఉద్యోగాల భర్తీకి సంబంధించిన తుది పరీక్షల ప్రక్రియ ఏప్రిల్ 30తో ముగియనుంది. పోలీసు కానిస్టేబుల్ (సివిల్), పోలీసు కానిస్టేబుల్(ఐటీ ు సీవో) ఉద్యోగాలకు సంబంధించిన తుది రాతపరీక్షల తేదీలను తెలంగాణ స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఖరారు చేసింది. ఏప్రిల్ 30న ఈ రాతపరీక్షలను నిర్వహించాలని నిర్ణయించింది. సివిల్ ఉద్యోగాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఐటీ అండ్ సీవో ఉద్యోగాలకు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను ఏప్రిల్ 24 తేదీ ఉదయం 8 గంటల నుంచి ఏప్రిల్ 28న అర్థరాత్రి 12 గంటల వరకు సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసేప్పుడు ఏదైనా సమస్య తలెత్తినట్లయితే 9393711110, 939100 5006 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొంది.తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఏఈఈ(సివిల్) పోస్టులకు ఆన్‌లైన్‌లో రాతపరీక్ష నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. మే 21న ఏఈఈ పోస్టులకు ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తామని గతంలో టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, అగ్రికల్చర్, మెకానికల్ పోస్టులతో పాటు సివిల్ పోస్టులకు కూడా ఆన్‌లైన్‌లో రాతపరీక్ష నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. ఈ మేరకు ఏప్రిల్ 21న అధికారికంగా ప్రకటించింది. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం మే 8న ఎలక్ట్రికల్ ు ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్; మే 9న అగ్రికల్చర్, మెకానికల్ ఇంజినీరింగ్ అభ్యర్థులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇక మే 21, 22 తేదీల్లో రెండు షిఫ్టుల్లో ఏఈఈ(సివిల్) పోస్టులకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిం చనున్నారు. తుది స్కోరు ఖరారులో నార్మల ైజేషన్ పద్ధతిని పాటించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వంలోని పలు విభాగాల్లో మెడికల్ ఆఫీసర్ల నియామకానికి సంబంధించిన కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్-2023 నోటిఫికేషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఏప్రిల్ 19న విడుదల చేసింది. దీనిద్వారా వివిధ విభాగాల్లో 1261 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎంబీబీఎస్ అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు నిర్దిష్ట శారీరక/ వైద్య ప్రమాణాలకు కలిగి ఉండాలి. సరైన అర్హతలు ఉన్న అభ్యర్థులు ఏప్రిల్ 19 నుంచి మే 9న సాయంత్రం 6 గంటల వరకు తమ దరఖాస్తులు సమర్పించవచ్చు. అభ్యర్థులు దరఖాస్తు ఫీజుగా 200 చెల్లించాల్సి ఉంటుంది. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంది. యూపీఎస్సీ సీఎంఎస్ పరీక్ష జులై 16న దేశవ్యాప్తంగా 41 సెంటర్లలో నిర్వహించనున్నారు.

# గణనాధుని సేవలో బెంగళూరు సిటీ పద్మనాభ నగర్ కాంగ్రెస్ అభ్యర్థి రఘునాథ నాయుడు

**కాణిపాకం**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం కస్తూరి నాయన పల్లి గ్రామానికి చెందిన రఘునాథ నాయుడు బెంగళూరు సిటీ పద్మనాభ నగర్ 171 లో పోటీ చేయుచున్న కాంగ్రెస్ అభ్యర్థి గా పోటీ చేస్తున్నారు. గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి చేస్తున సేవలు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి బెంగళూర్ సిటీలోని పద్మనాభ నగర్ కి కాంగ్రెస్ టికెట్ ఇవ్వడంతో కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. .స్వామివారి దర్శనం కోసం కాణిపాకం విచ్చేసిన రఘునాథ నాయుడు ను ఆయన గ్రామస్తులు,మిత్రులు ఘనంగా స్వాగతం పలికారు... అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నేను ఎమ్మెల్యే గెలిచిన తర్వాత కాణిపాకం వినాయక స్వామి ఆలయాన్ని ఊహించిన విధంగా అభివృద్ధి కి సహకరిస్తానన్నారు

# మరో అంతర్జాతీయ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్:**

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. కృత్రిమ మేధపై దుబాయ్‌లో జరగనున్న ప్రపంచ స్థాయి ప్రదర్శనకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. జూన్ 7, 8 తేదీల్లో దుబాయ్‌లోని జుమేరా ఎమిరేట్స్ టవర్స్‌లో వరల్డ్ ఏఐ షో-మెనా 41వ గ్లోబల్ ఎడిషన్ జరగనుంది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా రావాలని నిర్వాహణ సంస్థ ట్రెస్కాన్ కేటీఆర్‌ను ఆహ్వానించింది. ప్రభుత్వ ప్రతినిధులతో పాటు ఆరోగ్య, రిటైల్, తయారీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, స్థిరాస్తి, రవాణా వంటి అనేక రంగాలకు చెందిన కంపెనీల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ఇప్పటికే విజయవంతమైన అనుభవాలు, వాటి ఫలితాలను సమావేశంలో ప్రదర్శిస్తారు. ఏఐ ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రాథమికంగా చర్చించడంతో పాటు, వివిధ దేశాల నుంచి పాల్గొంటున్న ప్రతినిధులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో తమ అనుభవాలను వివరిస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో అద్భుతమైన ఫలితాలు సాధించిన సంస్థలు, వ్యక్తులకు అవార్డులు ప్రధానం చేయనున్నారు. మంత్రి కేటీఆర్ నేతృత్వంలో ఐటీ, దాని అనుబంధ రంగాల్లో తెలంగాణ అద్భుత పురోగతి సాధించిందని.. అటువంటి నేతలు పాల్గొనడంతో సమావేశానికి ఎంతో విలువ చేకూరుతుందని ట్రెస్కార్ వ్యవస్థాపకులు, ఎండీ మహమ్మద్ సలీం మంత్రికి పంపిన ఆహ్వానంలో పేర్కొన్నారు.

# జామాయిల్ తోటలో మృతదేహం లభ్యం

**తిరుపతి**

తిరుపతి జిల్లా చిల్లకూరు మండల పరిధిలోని రెట్టపల్లి - తీపనూరు గ్రామాల నడుమ ఒక జామాయిల్ తోటలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సుమారు 50 సంవత్సరాలు వయసు కలిగిన ప్రభు సింగ్ అనే వ్యక్తి మృతదేహాన్ని చిల్లకూరు పోలీసులు గుర్తించి అమృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు .చిల్లకూరు పోలీసుల సమాచారం మేరకు చిల్లకూరు మండల పరిధిలోని గ్రామాల నడుము ఒక జామాయిల్ తోటలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు . ఝార్ఖండ్ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఈ ప్రాంతంలో మృతి చెందడంపై అనుమానస్పద మృతిగా స్థానికులు వ్యక్తం చేస్తున్నారు .

# సెల్ఫిష్' నుంచి చైత్ర గా ఇవానా పరిచయం



తొలి చిత్రం 'రౌడీ బాయ్స్'తో ఆకట్టుకున్న యంగ్ హీరో ఆశిష్ రెడ్డి, నూతన దర్శకుడు కాశీ విశాల్ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్ , ప్రముఖ నిర్మాత దిల్ రాజు, శిరీష్ ల శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మిస్తున్న యూత్ ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్ 'సెల్ఫిష్' తో వస్తున్నాడు.

ఇందులో ఆశిష్ మాస్ క్యారెక్టర్‌లో నటిస్తున్నాడు. గతంలో విడుదల చేసిన పోస్టర్‌లలో రెక్లెస్ యాటిట్యూడ్ చూపించాడు. ఇప్పుడు ఈ చిత్రంలో కథానాయిక నటిస్తున్నా ఇవానా ను చైత్ర పాత్రలో పరిచయం చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ ఇవానా ఎదో ఆందోళనలో వున్నట్లుగా కనిపించగా.. ఆశిష్ ఆమెని తదేకంగా చూస్తునట్లుగా కనిపించారు.

ఐడీ కార్డ్ సూచించినట్లుగా ఇవానా ఇందులో ఫైనాన్సియల్ ఎనలిస్ట్ గా కనిపిస్తుంది. పోస్టర్‌లో ఇవానా సింపుల్‌గా కనిపించింది. ఆశిష్ గిరజాల జుట్టు, గడ్డంతో మోడిష్‌గా కనిపిస్తున్నాడు.

రిజర్వ్‌డ్ ఫర్ మై లవ్ అనే గూగుల్ సెర్చ్ స్పేస్ కనిపిస్తోంది. ఈ కథ హైదరాబాద్‌లోని పాతబస్తీలో జరుగుతుంది. ఆశిష్ సెల్ఫిష్ ఓల్డ్ సిటీ వ్యక్తిగా కనిపిస్తాడు. అతను జీవితంలోని తీపిని మాత్రమే కోరుకునే వ్యక్తి.

హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, అశోక్ బండ్రెడ్డి ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, ఎస్ మణికంధన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి చంద్రబోస్ లిరిక్ రైటర్. ప్రవీణ్ పూడి ఎడిటర్, కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్.

సెల్ఫిష్ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది.

# ఈ నెల 29న రాబోతున్న విద్యార్థి!



చేతన్ చీను, బన్నీవోక్స్ జంటగా నటించిన చిత్రం 'విద్యార్థి'. మధు మాదాసు దర్శకత్వంలో మహాస్ క్రియేషన్స్ పతాకంపై ఆళ్ల వెంకట్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కాన్సెప్ట్ పోస్టర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. నిర్మాత డి.ఎస్.రావు ఆధ్వర్యంలో ఈ నెల 29న సినిమాను విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డి.ఎస్.రావు మాట్లాడుతూ "చేతన్ చీనుచ చెప్పగా నేనీ సినిమా చూశారు. ఆధ్యంతం ఉత్కంఠగా సాగుతుంది. దర్శకుడికిది తొలి చిత్రం అయినా చాలా లావిష్‌గా రూపొందించారు. చేతన్‌కు ఇండస్ట్రీలో బ్యాగ్రౌండ్ ఒకటే లేదు కానీ హీరోకి ఉండాల్సిన అన్ని క్వాలిటీస్ అతనిలో ఉన్నాయి. మంచి స్టార్ అవుతాడు. ఈ సినిమా మీద నమ్మకంతో విడుదల చేయడానికి ముందుకొచ్చా" అని అన్నారు. దర్శకుడు మధు మాదాసు మాట్లాడుతూ

"దర్శకుడిగా తొలి చిత్రమిది. చాలాకష్టపడి తీశాం. ఎక్కడా బ్రేక్ లేకుండా సింగిల్ షెడ్యూల్‌లో సినిమా పూర్తి చేశాం. కాకపోతే కరోనా వల్ల సినిమా ఆలస్యమైంది. డి.ఎస్.రావు సినిమా చూసి విడుదల చేయడానికి ముందుకొచ్చారు. ఈ నెల 29న విడుదల చేస్తున్నాం" అని అన్నారు. చేతను చీను మాట్లాడుతూ'రాజుగారి గది' పెద్ద హిట్ తర్వాత డిఎస్.రావుగారు ఓ మంచి రొమాంటిక్ కామెడీ చిత్రంతో హీరోగా లాంచ్ చేశారు. అది కూడా మంచి హిట్ అయింది. రాజుగారి గది చిత్రం నుంచి దర్శకుడు మధుతో పరిచయం ఉంది. ఆయనతో ఓ సినిమా అనుకున్నాం కానీ కుదరలేదు. ఓ రోజు రాత్రి 12 తర్వాత ఫోన్ చేసి ఓ లైన్ అనుకున్నా చేస్తారా అనడిగారు. నాకు ఆయన ప్యాషన్ ఏంటో తెలుసు. కథ, నిర్మాతలు ఎవరు అన్నది ఏమీ అడగకుండానే ఓకే చెప్పేశా. మా నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సింగిల్ షెడ్యూల్‌లో సినిమా పూర్తిచేశారు. కాకపోతే కరోనా వల్ల రిలీజ్ ఆగింది. సినిమా విడుదలకు మా నిర్మాతలు పడుతున్న కష్టం చూసి డి.ఎస్.రావు గారికి మా సినిమా చూపించాను. ఆయనకు నచ్చి నేనే రిలీజ్ చేస్తానన్నారు. ఈ చిత్రం మా అందరి తలరాతను మారుస్తుందనే నమ్మకం ఉంది. ప్రతి ప్రాంతంలోనూ జరిగే ఓ అంశాన్ని తీసుకుని దర్శకుడు కథ రాశారు. అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అని అన్నారు.'



# 'మామా మశ్చీంద్ర' టీజర్ లాంచ్



నైట్రో స్టార్ సుధీర్ బాబు క్రేజీ ప్రాజెక్ట్ 'మామా మశ్చీంద్ర' లో త్రిపాత్రాభినయంలో కనిపించనున్నారు. యాక్టర్ -ఫిల్మ్ మేకర్ హర్షవర్ధన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పిపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మించారు. దుర్గ- స్థూలకాయుడు, పరశురాం- ఓల్డ్ డాన్, డిజె .. ఇలా మూడు భిన్నమైన పాత్రల పోస్టర్స్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా టీజర్‌ను సూపర్‌స్టార్ మహేష్ బాబు లాంచ్ చేశారు. టీజర్‌లో సుధీర్‌బాబు మూడు పాత్రలు, వాటి క్యారెక్టరైజేషన్ ని పరిచయం చేసేలా ఉంది. దుర్గ జీవితంలో గర్ల్‌ఫ్రెండ్ కావాలని తపిస్తుంటాడు, డిజే ఏవో కారణాల వలన అమ్మాయిలను వద్దనుకుంటాడు. పరశురామ్ ఈ ఇద్దరిని చంపాలనుకునే డెడ్లీ ఓల్డ్ డాన్. టీజర్ అసాధారణంగా అదే సమయంలో వినోదాత్మకంగా ఉంది.సుధీర్ బాబు మూడు పాత్రల మధ్య వైవిధ్యాన్ని అద్భుతంగా చూపించాడు. డీజేగా తెలంగాణ స్లాంగ్‌లో డైలాగులు చెబుతూ అలరించారు. మిర్నాళిని రవి, ఈషా రెబ్బా గ్లామరస్ గా కనిపించారు. హర్షవర్ధన్ యూనిక్ కథతో పాత్రలను ఆకట్టుకునేలా ప్రజంట్ చేశారు.పిజి విందా సినిమాటోగ్రఫీ బ్రిలియంట్ గా వుంది. చైతన్ భరద్వాజ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఫన్ ని ఎలివేట్ చేసింది. ఓవరాల్ గా టీజర్ ఆసక్తిని రేకెత్తిస్తోంది.తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ ద్విభాషా చిత్రాన్ని సృష్టి సెల్యులాయిడ్ సోనాలి నారంగ్, సృష్టి సమర్పిస్తున్నారు.

తారాగణం: సుధీర్ బాబు, మిర్నాళిని రవి, ఈషా రెబ్బా, హర్షవర్ధన్

# హార్రర్ కామెడీ కాన్సెప్ట్ తో ఓ మంచి ఘోస్ట్



తెలుగు తెరపై మ్యూజిక్ డైరెక్టర్ గా ఎన్నో సినిమాలకు పనిచేసి, మరెన్నో విలువైన పాటలను అందించిన అనుప్ రుబెన్స్ సమర్పణలో, మార్క్ సెట్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై డాక్టర్ అబినికా ఐనభాతుని నిర్మాత గా శంకర్ మార్తాండ్ డైరెక్షన్ లో తెరకెక్కిస్తున్న తాజా చిత్రం ఓఎమ్ జీ. ఓ మంచి ఘోస్ట్ అనే ట్యాగ్ లైన్ తో హర్రర్ కామెడీ జోనర్ లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ అండ్.. గ్లింప్స్ ని ప్రముఖ తెలుగు సెన్సేషనల్ అండ్ క్రియేటివ్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ.. తన చేతులు మీదుగా పోస్టర్ ను రివీల్ చేయడం సంతోషంగా ఉందని, సినిమా పోస్టరే చాలా ఆసక్తిగా ఉందని చెప్పారు. నిజానికి ఘోస్ట్ అంటే ఓ నెగిటీవ్ ఫోర్స్ ఉంటుందని ప్రచారం ఉంది దానికి పూర్తి వ్యతిరేకంగా ఓ మంచి ఘోస్ట్ అనే టైటిల్ అండ్ కాన్సెప్ట్ బాగుందని, ఈ సినిమా ప్రేక్షకలుకు సైతం బాగా కనెక్ట్ అవుతుందని, ఓఎమ్ జీ టీమ్ ఆల్ ది బెస్ట్ చెప్పారు.

మ్యూజిక్ డైరెక్టర్ అనుప్ రూబెన్స్ మాట్లాడుతూ.. ఓ హర్రర్ కామెడీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చే మా ప్రయాత్నాన్ని సపోర్ట్ చేసినందుకు ఆర్జీవికి కృతజ&జతలు తెలిపారు. డైరెక్టర్ శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ.. ఈ సినిమా ఆద్యాంతం హర్రర్ కామెడీ తో ప్రేక్షకులను అలరిస్తుందని, ఇలాంటి సబ్జెక్ట్ రాసుకోవడానికి ఆర్జీవినే స్ఫూర్తి అని తెలిపారు. ఇది కచ్చితంగ ప్రేక్షకులను అలరిస్తుందని నమ్మకంగా తెలిపారు.

అలాగే సినిమా పూర్తి అయిన తరువాత కచ్చితంగా మాతో కలిసి చూడాలని ఆర్జీవి దగ్గర మాట తీసుకున్నారు. వెన్నెల కిశోర్, శకలక శంకర్, కమెడియన్ రఘు తదితరులు నటిస్తున్నట్లు తెలుస్తుంది.

తారాగణం : వెన్నెల కిశోర్, శకలక శంకర్, నిదిత శ్వేత,నవమి గాయక్, నవీన్ నేని,రజిత్ రాఘప్రఘు బాబుల , నాగినీడు,బహుబలి ప్రభాకర్,శేకింగ్ శేషు తదితరులు

# ఆదిపురుష్ నుంచి జై శ్రీ రామ్ సాంగ్ రిలీజ్



అక్షయ తృతీయ సందర్భంగా అందరికీ శ్రేయస్సులు కలగాలని కోరుకుంటూ.. ఆదిపురుష్ మూవీ నుంచి జై శ్రీరామ్ నామం ప్రతిధ్వనించేలా ఒక లిరికల్ ఆడియో క్లిప్ ను విడుదల చేసింది టీమ్. సంగీత ద్వయం అజయ్-అతుల్ స్వరపరిచిన ఈ గీతాన్ని హిందీ, తమిళ్, తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేశారు. భక్తి పాటలు కంపోజ్ చేయడంలో ది బెస్ట్ అనిపించుకున్న ఈ మ్యూజికల్ ద్వయం మరోసారి అద్భుతమైన ట్యూన్ తో ఆకట్టుకున్నారు. ఈ పాట సినిమా కె కాకుండా ఏళ్ళ తరబడి వినిపించేలా.. జై శ్రీరామ్ అనే నినాదం మారుమ్రోగేలా ఉండబోతోంది.

ఈ ట్రాక్ కు అనుగుణంగా రాఘవ్ గా ప్రభాస్ అద్భుతమైన పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో శ్రీ రాముడు శౌర్యం, శక్తి, బలం కనిపిస్తోంది.

రాఘవుని సద్గుణం, దాతృత్వం, బలమైన పాత్ర స్వరూపం కనిపిస్తున్నాయి.తండ్రి వాక్కుకు కట్టుబడి, ఒకే బాణం ఒకే భార్య అనే మాటకు ఆదర్శనంగా నిలిచినా శ్రీ రామ లక్షణాలకు ప్రతీకగా ఈ పోస్టర్ కనిపిస్తోంది. మొత్తంగా అభిమానులకు ఈ అక్షయ తృతీయ సందర్భంగా అద్భుతమైన ట్రీట్ ఇచ్చింది ఆదిపురుష్ టీం.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950